thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 212 | జగిత్యాల ఆదివారం 15 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

చివరి బంతి వరకు ఉత్కంఠ



11



వాగ్దానం నెరవేర్చాం

- గిగ్ వర్కర్లు దేశాభివృద్ధిలో భాగస్వాములు
- వారు బానిసలనేది బీజేపీ భావజాలం
- భాగస్వాములనేది కాంగ్రెస్ భావజాలం
- గిగ్ వర్కర్ల సామాజిక భద్రత- సంక్షేమ పథకం ప్రారంభోత్సవంలో రాహుల్ గాంధీ

గిగ్ వర్కర్లకు తాము ఇచ్చిన హామీని, వాగ్దానాన్ని నెరవేర్చామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని జయభేరి గ్రౌండ్స్‌లో నిర్వహించిన గిగ్ వర్కర్స్ సభలో సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి వివేక్‌తో కలిసి 'గిగ్ వర్కర్ల సామాజిక భద్రత-సంక్షేమ పథకాన్ని' ప్రారంభించారు. ప్రస్తుత శతాబ్దం డేటా శతాబ్దమని, గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఉబర్ వంటి సంస్థలన్నీ డేటా ఆధారం గానే నడుస్తున్నాయని తెలిపారు. అయితే కష్టపడే గిగ్ వర్కర్లకు మాత్రం ఇప్పటివరకు తమ సొంత పని డేటాపై హక్కు లేకుండా పోయిందని, తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం ద్వారా వారు ఎన్ని డెలివరీలు చేశారు, ఎంత సమయం పట్టింది, ప్రతి రైడ్‌కు ఎంత డబ్బు వస్తోంది అనే పూర్తి సమాచారం నేరుగా వారి మొబైల్ ఫోన్‌లోనే అందుబాటులో ఉంటుందని వివరించారు.

వివరాలు 2వ పేజీలో

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రపంచమంతా

ఏకం కావాలి!



- ప్రజల ఆకాంక్షల సాధనకు కలిసికట్టుగా పోరాడాలి
- రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది
- ప్రజాస్వామ్యం, నియంతృత్వం మధ్య పోరాటం సాగుతోంది
- సామాన్యుల కోసం ప్రభుత్వాలు పనిచేయాలి
- పేదలు, మహిళలు, రైతుల హక్కులను పరిరక్షించాలి
- భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి ప్రతినిధులకు ఆహ్వానం
- సదస్సు ముగింపు సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): ప్రజల కలలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులంతా ఏకమై పోరాడాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధ పాలన, ప్రజాస్వామ్య విలువలు, పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆకాంక్షలు దాదాపు ఒకే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో రెండు రోజులపాటు నిర్వహించిన భారత్ సమ్మిట్-2026 ముగింపు సమావేశంలో 'ప్రపంచ న్యాయ సాధన' అంశంపై సీఎం ప్రసంగించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించేందుకు అంతర్జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్య శక్తుల మధ్య ఐక్యత అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచంలో ప్రజాస్వామ్య పరిరక్షణను కోరుకునే శక్తులు, నియంతృత్వ ధోరణులను ప్రోత్సహించే శక్తుల మధ్య సంఘర్షణ కొనసాగుతోందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకవైపు రాజ్యాంగం, చట్టబద్ధ పాలన, ప్రతి పౌరుడి ఓటుహక్కు కోసం పోరాడుతుంటే,

మిగతా 2 లో

దేశానికే ఆదర్శం
తెలంగాణ గ్రేహౌండ్స్

- నక్సలిజం, ఉగ్రవాద నియంత్రణలో కీలక పాత్ర
- గ్రేహౌండ్స్ లో షూటింగ్ హౌస్ ప్రారంభం
- ఆల్ ఇండియా పోలీస్ కమాండో పోటీల్లో ప్రథమ స్థానం సాధించాలి
- డీజీపీ ఆనంద్

2

తెలంగాణలో పెట్టుబడులకు రెడ్ కార్పెట్!

రాష్ట్రంలో విధానపరమైన గందరగోళానికి తావులేదు

భూములు, అనుమతులు, వసతులు కల్పిస్తాం

- హైదరాబాద్‌లో ఎలీ లిల్లీ సంస్థ బిలియన్ డాలర్ల పెట్టుబడి
- మూసీ ప్రక్షాళనతోనే నల్గొండ ప్రజల ఆరోగ్యానికి రక్షణ
- పీహెచ్‌ఎఫ్ఐ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

2

డిజిటల్ అరెస్ట్ పేరుతో రిటైర్డ్ అధికారికి టోకరా

- సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



2



యాదాద్రీశుని సన్నిధిలో కార్తీకోత్సవ వైభవం!

- ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు వేడుకలు
- కోటి పుష్పార్చనతో ఉత్సవాలకు శ్రీకారం
- ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి సంగీత విభావరులు

2

నీళ్ల కోసం నిలదీస్తారా.. లేక తలవంచి తిరిగొస్తారా?

- 968 టీఎంసీల గోదావరి జలాల హక్కులపై ప్రధాని మోదీని నిలదీయాలి
- సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు వెంటనే కేంద్ర అనుమతులు సాధించాలి
- గోదావరి-కావేరి అనుసంధానం ఇచ్చంపల్లి నుంచే చేపట్టాలి
- రాష్ట్ర ప్రయోజనాలను విస్మరిస్తే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిక



3



తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బీఎం సందీప్

ఉత్తర్వులు జారీ చేసిన కేసీ వేణుగోపాల్

2

నిజమైన ఫాసిస్ట్ పార్టీ కాంగ్రెస్సే

- ఎమర్జెన్సీ చీకటి రోజులను దేశం ఇంకా మరచిపోలేదు
- వంద ఎన్నికల్లో ఓటమితో 'డిఫీట్ సెంచరీ' చేసిన రాహుల్
- హైదరాబాద్లో జరిగింది పక్కా భారత వ్యతిరేక సమ్మిట్
- కేంద్ర శాఖ మంత్రి కిషన్ రెడ్డి

3





చిన్నారుల భద్రతే ప్రాధాన్యం!

- ప్రతి చిన్నారి రక్షణ సమాజ సమష్టి బాధ్యత
- బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ
- ఆరు జిల్లాల్లో ప్రత్యేక దత్తత కేంద్రాల ప్రారంభం
- నాలుగు జిల్లాల బస్టాండ్లలో చైల్డ్ హెల్ప్ డెస్క్‌లు
- బాలల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపడతాం
- బాలల దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క

3

మోదీ స్వయంగా ఫోన్లు ట్యాప్ చేయరు



- రాహుల్‌కు భిన్నంగా పిట్రోడా వ్యాఖ్యలు!
- ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు

4

హామీ ఇస్తేనే హసీనాను పంపిస్తాం

- బంగ్లాదేశ్‌కు భారత్ రెండు కీలక షరతులు!
- మరణశిక్షపై అప్పీల్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్



4

కశ్మీర్‌లో పోలీసుల హత్యల వెనుక కుట్ర?

- మసీదు నుంచి బెదిరింపులంటూ బీజేపీ ఎమ్మెల్యే ఆరోపణలు!
- కిష్ట్వార్‌లో ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారుల హత్య కలకలం
- ఉగ్రవాదుల ఆచూకీకి రూ.30 లక్షల నజరానా ప్రకటన



4



డిజిటల్ అరెస్ట్ పేరుతో రిటైర్డ్ అధికారికి టోకరా

కేంద్ర రక్షణ శాఖ మాజీ ఉన్నతాధికారిని లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు

ముంబై పోలీసులమంటూ నకిలీ అరెస్ట్ వారెంట్‌తో బెదిరింపులు

హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు మరో భారీ మోసానికి తెరలేపారు. గచ్చిబౌలిలో నివసిస్తున్న కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసిన వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని రూ.72.30 లక్షలు కాజేశారు. ఖాజాగూడకు చెందిన రిటైర్డ్ ఓఈఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుభాష్ కుమార్ ఆచార్య (69) ఈ మోసానికి బాధితుడయ్యారు. గత నెల 15న గుర్తుతెలియని వాట్సాప్ నంబర్ నుంచి ప్రదీప్ అనే వ్యక్తి ఆయనకు ఫోన్ చేశాడు. ముంబైలో సుభాష్ కుమార్ పేరుతో కేసు నమోదైందని, 'డేటా బోర్డ్ ఆఫ్ ఇండియా' పేరుతో అరెస్ట్ వారెంట్ జారీ అయిందని భయపెట్టాడు. ముంబై పోలీసు క్రైమ్ బ్రాంచ్ పేరుతో నకిలీ ఉత్తర్వులు పంపి నమ్మించాడు. ఈ వ్యవహారాన్ని ఎవరికీ వెల్లడించకూడదంటూ బాధితుడితో పాటు ఆయన భార్యతోనూ హామీ పత్రం రాయించుకున్నారు. అనంతరం మరో వ్యక్తి ముంబైలోని కొలాబా పోలీసు అధికారినంటూ వీడియో కాల్ చేసి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించాడు. లావాదేవీలను పరిశీలించిన తర్వాత ఎలాంటి అక్రమాలు లేవని తేలితే నగదు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికాడు. దీంతో ఆర్‌టీజీఎస్ ద్వారా విడతలవారీగా డబ్బులు బదిలీ చేయించుకున్నాడు. నిందితుల బెదిరింపులకు భయపడిన సుభాష్ కుమార్ తన భార్య బంగారు ఆభరణాలను ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి గోల్డ్ లోన్ తీసుకున్నారు. ఆ మొత్తాన్ని కూడా సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాలకు జమ చేశారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 5 వరకు తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లోని బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.72.30 లక్షలు బదిలీ చేశారు. ఈ నెల 11న తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బీఎం సందీప్

మీనాక్షి నటరాజన్ స్థానంలో కొత్త నియామకం

తక్షణమే అమల్లోకి వచ్చిన అధిష్ఠానం నిర్ణయం

ఉత్తర్వులు జారీ చేసిన కేసీ వేణుగోపాల్

మీనాక్షి సేవలను అభినందించిన కాంగ్రెస్ అధిష్ఠానం

హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఏఐసీసీ ఇన్‌చార్జిగా బీఎం సందీప్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన మీనాక్షి నటరాజన్ స్థానంలో ఆయనను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం శనివారం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో చేపట్టిన ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని వెల్లడించారు. మీనాక్షి నటరాజన్ పార్టీకి అందించిన సేవలను అధిష్ఠానం ప్రత్యేకంగా అభినందించింది. కర్ణాటకకు చెందిన సందీప్ గతంలో గుజరాత్, మహారాష్ట్ర కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల్లో బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణలో పార్టీ సంస్థాగత కార్యకలాపాల పర్యవేక్షణ, రాష్ట్ర నాయకత్వంతో సమన్వయం తదితర బాధ్యతలను ఆయన చేపట్టనున్నారు. కాగా, మీనాక్షి నటరాజన్ 2025 ఫిబ్రవరిలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. తాజాగా ఆమె స్థానంలో సందీప్‌కు బాధ్యతలు అప్పగించడం రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలక సంస్థాగత మార్పుగా మారింది.

రాహుల్ గాంధీ హామీలన్నీ గాలి మాటలే: బండి సంజయ్

హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన గిగ్ వర్కర్ల సంక్షేమ పథకంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ నోట పలికేవన్నీ గాలి మాటలేనని ఆయన విమర్శించారు. గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని రాహుల్ గాంధీ చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు ఇప్పటివరకు గాలి మూటలుగానే మిగిలిపోయిన మాట వాస్తవం కాదా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్‌ల అమలు ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత హామీలను నెరవేర్చకుండా పక్కనపెట్టేసి, ఇప్పుడు కొత్తగా మరో హామీ ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు సరిగ్గా కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఇచ్చిన హెల్త్ కార్డులు కూడా ఆసుపత్రులలో సరిగ్గా పనిచేయడం లేదని ఆయన గుర్తుచేశారు. ఉన్న పథకాలకే దిక్కులేకుండా చేసి, కొత్తగా గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య భద్రత కల్పిస్తామంటే ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని సంజయ్ స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రపంచమంతా ఏకం కావాలి!

మొదటి పేజీ తరువాయి



మరోవైపు అధికారాన్ని కొందరి చేతుల్లో కేంద్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపులు, భిన్నాభిప్రాయాలకు గౌరవం ఉండాలని స్పష్టం చేశారు. ఏకవ్యక్తి, ఏకపార్టీ ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా నిలవాలని కోరారు. పేదలు, మహిళలు, రైతులు, మైనారిటీలతోపాటు సమాజంలోని అన్ని వర్గాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సీఎం పేర్కొన్నారు. సంపన్న వర్గాల ప్రయోజనాలకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రపంచీకరణ, కరోనా మహమ్మారి అనంతర పరిణామాలతో అనేక దేశాలు విద్య, వైద్యం, ఉపాధి, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణతోపాటు పర్యావరణ సంరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వాలు గుర్తించి, వాటిని నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. భారత్ సమ్మిట్ ప్రపంచవ్యాప్తంగా ఒకే విధమైన ప్రజాస్వామ్య ఆలోచనలు కలిగిన నాయకులు, ప్రతినిధులు, ప్రభావశీల వ్యక్తులను ఒక వేదికపైకి తీసుకురావడానికి దోహదపడిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సదస్సుకు 70 దేశాల నుంచి వెయ్యి మందికిపైగా ప్రతినిధులను ఆహ్వానించినట్లు వెల్లడించారు. అయితే కొందరు విదేశీ ప్రతినిధులకు కేంద్ర ప్రభుత్వం వీసాలు నిరాకరించిందని ఆరోపించారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అనేక మంది ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తున్నారని పేర్కొన్నారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఈ సదస్సు నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుందని సీఎం అన్నారు. దేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి నెహ్రూ దార్శనికత దోహదపడిందని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం అంతర్జాతీయ స్థాయిలో సహకారం పెరగాలని ఆకాంక్షించారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాలే ప్రజాస్వామ్యానికి నిజమైన బలమని, సమష్టి కృషితోనే ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చగలమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

వాగ్దానం.. నెరవేర్చాం

గిగ్ వర్కర్లు దేశాభివృద్ధిలో భాగస్వాములు

వారు బానిసలనేది బీజేపీ భావజాలం

భాగస్వాములనేది కాంగ్రెస్ భావజాలం

గిగ్ వర్కర్ల సామాజిక భద్రత- సంక్షేమ పథకం ప్రారంభోత్సవంలో రాహుల్ గాంధీ



హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): గిగ్ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీని తెలంగాణలో నెరవేర్చామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. దేశాభివృద్ధిలో గిగ్ కార్మికులు కీలక భాగస్వాములని, వారి శ్రమకు తగిన గుర్తింపు, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని జయభేరి మైదానంలో నిర్వహించిన గిగ్ కార్మికుల సభలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి గిగ్ కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ కొంతకాలం క్రితం గిగ్ కార్మికులతో సమావేశమైనప్పుడు వారి సమస్యలు తెలుసుకుని అండగా ఉంటామని హామీ ఇచ్చామని, ఇప్పుడు ఆ మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుత శతాబ్దం సమాచార శతాబ్దమని, ప్రపంచవ్యాప్తంగా గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఉబర్ వంటి సంస్థలు సమాచార ఆధారంగానే వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. అయితే గిగ్ కార్మికులు తాము ఎన్ని డెలివరీలు చేశారో, ఎంతసేపు పనిచేశారో, ఎంత ఆదాయం పొందారో తెలుసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంతో కార్మికులకు తమ పని, ఆదాయ వివరాలను తెలుసుకునే హక్కు లభిస్తుందని చెప్పారు. ప్రతి ప్రయాణం, డెలివరీ, లావాదేవీకి సంబంధించిన చెల్లింపుల సమాచారం వారి మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉంటుందని వివరించారు. గిగ్ కార్మికులు రోజంతా ఎండలో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ సేవలు అందిస్తున్నా విశ్రాంతి తీసుకునేందుకు సరైన సదుపాయాలు లేవని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లో వైఫై సౌకర్యంతో కూడిన విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగినా, అనారోగ్యానికి గురైనా కార్మికుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నాయని పేర్కొన్నారు. అందుకే ప్రతి గిగ్ కార్మికుడికి రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్మికుల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రతి లావాదేవీపై ఒక శాతం మొత్తాన్ని సంక్షేమ నిధికి జమ చేసే విధానం తీసుకొచ్చామని రాహుల్ వివరించారు. ఉబర్, ఓలా ప్రయాణాలైనా, బ్లింకిట్ వంటి సంస్థల డెలివరీలైనా సంబంధిత లావాదేవీలపై కంపెనీలు నిర్దేశిత మొత్తాన్ని తెలంగాణ గిగ్ కార్మికుల సంక్షేమ బోర్డుకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నిధులను కార్మికుల సామాజిక భద్రతకు వినియోగిస్తామని చెప్పారు. గిగ్ కార్మికులకు పింఛను, కుటుంబాలకు విద్య, వైద్య భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో కార్మికుల విషయంలో రెండు భిన్నమైన భావజాలాలు ఉన్నాయని రాహుల్ వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం కార్మికుల శ్రమను వినియోగించుకుని లాభాలను సంపన్నులకు అందించడానికే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తలు, పెద్ద సంస్థల ప్రయోజనాల కోసం కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ మాత్రం గిగ్ కార్మికులను దేశాభివృద్ధిలో భాగస్వాములుగా భావిస్తోందని, వారి హక్కులు, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ గిగ్ కార్మికులకు అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. సభలో రాహుల్ గాంధీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధ్య జరిగిన సంభాషణ కూడా సభికుల దృష్టిని ఆకర్షించింది.

తెలంగాణలో పెట్టుబడులకు

రెడ్ కార్పెట్!

రాష్ట్రంలో విధానపరమైన గందరగోళానికి తావులేదు

భూములు, అనుమతులు, వసతులు కల్పిస్తాం

పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తాం

పీహెచ్ఎఫ్ఐ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విధానపరమైన గందరగోళం లేదని, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పించామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, నీళ్లు, అనుమతులు, మౌలిక సదుపాయాలను అందించేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించామని చెప్పారు. హైదరాబాద్‌లో పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీహెచ్ఎఫ్ఐ) సంస్థకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యం, పరిశ్రమలు, సేవారంగాల్లో తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పీహెచ్ఎఫ్ఐ నిర్మాణాన్ని 2028 జూన్ 2 నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని సీఎం సూచించారు. సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, తానే స్వయంగా ప్రచారకర్తగా వ్యవహరిస్తానని ప్రకటించారు. ఐఎస్‌బీ, నల్సార్ వంటి విద్యా సంస్థలు హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. వైద్యరంగంలోనూ హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పీహెచ్ఎఫ్ఐ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించామని, మిగిలిన టిమ్స్ ఆస్పత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టామని, ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ ఔషధ పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం అన్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో ఐడీపీఎల్ ఏర్పాటు కావడం ద్వారా నగరంలో ఔషధ పరిశ్రమకు పునాదులు పడ్డాయని గుర్తుచేశారు. దేశంలోని బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం హైదరాబాద్‌లోనే జరుగుతోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఔషధ సంస్థ ఎలీ లిల్లీ నగరంలో బిలియన్ డాలర్ల పెట్టుబడికి ముందుకొస్తోందని తెలిపారు. పలు బహుళజాతి సంస్థలు తమ అంతర్జాతీయ సేవా కేంద్రాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు కూడా నగరంలో కేంద్రాలను ప్రారంభిస్తున్నాయని, మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థి సైతం ప్రపంచస్థాయిలో పోటీపడేలా విద్యావకాశాలు కల్పించాలన్నదే తమ సంకల్పమన్నారు. తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు 'తెలంగాణ రైజింగ్-2047' దార్శనిక ప్రణాళికను రూపొందించామని సీఎం వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్ పేరుతో మూడు ప్రాంతాలుగా అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పెట్టుబడిదారులు ఎలాంటి సందేహాలు లేకుండా తెలంగాణకు రావచ్చని భరోసా ఇచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఏటా సుమారు రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించి రోగుల వివరాలను సేకరిస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ఏ ప్రాంతంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయో గుర్తించి నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న ఆరోగ్య సమాచారాన్ని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వినియోగించుకోవాలని సూచించారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు ఇప్పుడు మూసీ కాలుష్యంతోనూ సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నల్గొండ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటే మూసీ ప్రక్షాళన తప్పనిసరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎఫ్ఐ చాన్సలర్ డాక్టర్ కె.శ్రీనాథ్‌రెడ్డి, ప్రో చాన్సలర్ ప్రొఫెసర్ సంజయ్ జోడ్పే, డాక్టర్ ఎం.విష్ణువర్ధన్‌రావు, పారిశ్రామికవేత్త శ్రీని రాజు, పీహెచ్ఎఫ్ఐ చైర్మన్ రజత్ గుప్తా, బోర్డు సభ్యుడు మధుమోహన్‌తోపాటు పలువురు వైద్య నిపుణులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

యాదాద్రీశుని సన్నిధిలో కార్తీకోత్సవ వైభవం!

ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు వేడుకలు

యాదాద్రి, నవంబర్ 14 (చురకలు): ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజులపాటు కార్తీకోత్సవం-2026ను ఘనంగా నిర్వహించనున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం, దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి సంగీత విభావరులు, శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కార్తీక మాస పవిత్రత, సనాతన ధర్మ సంప్రదాయాలు, తెలంగాణ కళా వైభవాన్ని ప్రజలకు చేరువ చేయడమే ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ నెల 20న కోటి పుష్పార్చన మహోత్సవంతో వేడుకలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 6 గంటల నుంచి బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, తేలు విజయ బృందం ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నారు. 21న సాయంత్రం 6 గంటల నుంచి ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ సంగీత దర్శకత్వంలో ప్రత్యేక సంగీత విభావరి జరగనుంది. ఉత్సవాల ముగింపు రోజైన 22న సాయంత్రం 6 గంటల నుంచి శాస్త్రీయ నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. రుద్రాక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒడిస్సీ నృత్యం, పరంపర సంస్థకు చెందిన అభినేత్రి బృందం ఆధ్వర్యంలో తెలంగాణ ఆలయాల వైభవంపై ప్రత్యేక నృత్య రూపకం, కళాకృష్ణ బృందం పేరిణి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భక్తి పారవశ్యం, ఆధ్యాత్మిక పరిమళం, సంగీత మాధుర్యం, శాస్త్రీయ నృత్య వైభవం కలగలిసేలా కార్తీకోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. మూడు రోజులపాటు యాదగిరిగుట్టను ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలకు వేదికగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీకోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారి భద్రత, విద్య ప్రభుత్వ ప్రాధాన్యత

- ప్రతి చిన్నారి రక్షణ సమాజ సమష్టి బాధ్యత
- బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ
- ఆరు జిల్లాల్లో ప్రత్యేక దత్తత కేంద్రాల ప్రారంభం
- నాలుగు జిల్లాల బస్టాండ్లలో చైల్డ్ హెల్ప్ డెస్క్‌లు
- అంగన్‌వాడీ సేవల్లో కృత్రిమ మేధ వినియోగం
- బాలల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపడతాం
- బాలల దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): చిన్నారుల భద్రత, ఆరోగ్యం, విద్య, పోషకాహారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహతో కలిసి ఆమె పాల్గొన్నారు. తొలుత జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని నెహ్రూ విశ్వసించేవారని, ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు సమాజంపైనా ఉందన్నారు. చిన్నారులకు నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, పోషకాహారం, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు, శాఖ అధికారులు బాలల సంరక్షణను ప్రధాన బాధ్యతగా భావించాలని సూచించారు. సహజసిద్ధమైన పోషకాహారం ప్రాధాన్యాన్ని తల్లిదండ్రులకు వివరించాలని ఆదేశించారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 'బాలిక వివాహం.. బతుకు ఆగం' నినాదంతో రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి అవార్డులు అందించాలని అధికారులకు సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బాలల సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేసే పలు కార్యక్రమాలను మంత్రి సీతక్క వర్చువల్‌గా ప్రారంభించారు. కామారెడ్డి, మెదక్, వనపర్తి, సూర్యాపేట, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఆరు ప్రత్యేక దత్తత కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అనాథలు, నిరాశ్రయులు, తల్లిదండ్రుల సంరక్షణ కోల్పోయిన చిన్నారులకు ఈ కేంద్రాల ద్వారా రక్షణ కల్పించనున్నారు. ఒక్కో కేంద్రంలో గరిష్ఠంగా పది మంది చిన్నారులకు వసతి కల్పించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రంలో వైద్యుడు, నర్సు, సామాజిక కార్యకర్త, బాల్య విద్యా నిపుణుడు, ఆయాలతో కలిపి 11 మంది సిబ్బందిని నియమించనున్నారు. ఆపదలో ఉన్న చిన్నారులకు తక్షణ సహాయం అందించేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ప్రధాన బస్టాండ్లలో నాలుగు చైల్డ్ హెల్ప్ డెస్క్‌లను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మిషన్ వాత్సల్య పరిధిలోని బాలల సహాయవాణి 1098ను అత్యవసర సేవల సంఖ్య 112తో అనుసంధానించినట్లు వెల్లడించారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో చిన్నారులకు వేగంగా సహాయం అందుతుందన్నారు. హైదరాబాద్ జిల్లాలో బాలల సంరక్షణ గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతోపాటు సూర్యాపేట జిల్లాలో నూతన బాలల సంరక్షణ గృహాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ సేవల్లో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెడుతున్నట్లు సీతక్క తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార స్థితిని పర్యవేక్షించడంతోపాటు సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుందన్నారు. బాలల సంరక్షణ సంస్థలు, శిశు విహారాలు, బాల సదనాల్లో మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన చిన్నారులకు గుర్తింపు కార్డులు, దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నామని వివరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీమతి ఓజా మాట్లాడుతూ చిన్నారుల హక్కులు, భద్రత, విద్యను పరిరక్షించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. పిల్లలు సమస్యలు ఎదుర్కొన్నప్పుడు ఉపాధ్యాయులు, వార్డెన్లు, నమ్మకమైన పెద్దలను సంప్రదించాలని, అవసరమైతే 1098 సహాయవాణికి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ సంచాలకురాలు సంగీత సత్యనారాయణ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు, శాఖ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



నీళ్ల కోసం నిలదీస్తారా.. లేక తలవంచి తిరిగొస్తారా?

- 968 టీఎంసీల గోదావరి జలాల హక్కులపై ప్రధాని మోదీని నిలదీయాలి
- సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు వెంటనే కేంద్ర అనుమతులు సాధించాలి
- గోదావరి-కావేరి అనుసంధానం ఇచ్చంపల్లి నుంచే చేపట్టాలి
- తెలంగాణకు 75 టీఎంసీల నీటి వాటా ఖరారు చేయాలి
- రాష్ట్ర ప్రయోజనాలను విస్మరిస్తే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిక



హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): తెలంగాణ నీటి హక్కుల కోసం కేంద్రాన్ని నిలదీస్తారా.. లేక తలవంచి తిరిగొస్తారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్రానికి చట్టబద్ధంగా దక్కాల్సిన 968 టీఎంసీల గోదావరి జలాల హక్కులపై ప్రధాని నరేంద్ర మోదీతో స్పష్టంగా మాట్లాడాలని, కేంద్రం నుంచి హామీలు సాధించాలని డిమాండ్ చేశారు. ఆదివారం ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి దిల్లీ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హైడ్రాలజీ సహా కీలక అనుమతులు పూర్తయిన సమ్మక్క-సారక్క ప్రాజెక్టు డీపీఆర్‌ను కొత్త మార్గదర్శకాల పేరుతో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వెనక్కి పంపడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఇది రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టులాంటిదని విమర్శించారు. కేవలం సాంకేతిక సలహా మండలి (టీఏసీ) అనుమతి మాత్రమే రావాల్సిన దశలో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పాత మార్గదర్శకాల ప్రకారమే డీపీఆర్‌ను ఆమోదించి, వెంటనే టీఏసీ అనుమతి ఇప్పించాలని కోరారు. గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పును బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. తొలుత ఇచ్చంపల్లి నుంచి ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఒత్తిడితో పోలవరం-బనకచర్ల మార్గానికి మార్చారని ఆరోపించారు. ఈ మార్పుతో ఏపీకి ప్రయోజనం చేకూరి తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటా దెబ్బతింటుందని పేర్కొన్నారు. గోదావరి నుంచి కావేరికి తరలించే 148 టీఎంసీల నీటిలో తెలంగాణకు 50 శాతం వాటా కింద 75 టీఎంసీలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టును ఇచ్చంపల్లి నుంచే చేపట్టాలని స్పష్టం చేశారు. తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకునేందుకు ఉద్దేశించిన అన్ని ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు సాధించాలని హరీశ్‌రావు కోరారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టు డీపీఆర్‌ను పాత మార్గదర్శకాల ప్రకారం ఆమోదింపజేసి టీఏసీ అనుమతి తీసుకురావాలని సూచించారు. గోదావరి-కావేరి అనుసంధానాన్ని ఇచ్చంపల్లి నుంచే చేపట్టడంతో పాటు తెలంగాణకు 75 టీఎంసీల వాటాను ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమైన పోలవరం-బనకచర్ల అలైన్‌మెంట్ మార్పును వ్యతిరేకించాలని కోరారు. దిల్లీ పర్యటనలో తెలంగాణ నీటి హక్కులపై గట్టిగా వాదించకుండా ప్రభుత్వం మౌనంగా వెనుదిరిగితే రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు చరిత్రహీనులుగా మిగిలిపోతారని హరీశ్‌రావు హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రయత్నాలను బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ప్రజాక్షేత్రంలో మరో భారీ ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రకటించారు.

దేశానికే ఆదర్శం తెలంగాణ గ్రేహౌండ్స్

- నక్సలిజం, ఉగ్రవాద నియంత్రణలో కీలక పాత్ర
- గ్రేహౌండ్స్ లో షూటింగ్ హౌస్ ప్రారంభం
- ఆల్ ఇండియా పోలీస్ కమాండో పోటీల్లో ప్రథమ స్థానం సాధించాలి
- డీజీపీ ఆనంద్



హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): తెలంగాణ గ్రేహౌండ్స్ దేశ పోలీసు వ్యవస్థకే ఆదర్శంగా నిలుస్తోందని డీజీపీ సి.వి.ఆనంద్ కొనియాడారు. నక్సలిజం, ఉగ్రవాదం, హైజాకింగ్ వంటి ముప్పులను ఎదుర్కోవడంలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ప్రత్యేక దళాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని గ్రేహౌండ్స్ ప్రాంగణంలో నూతన షూటింగ్ హౌస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1980వ దశకం నుంచి నక్సల్స్ కార్యకలాపాల నియంత్రణలో గ్రేహౌండ్స్ విశేష సేవలందించిందని గుర్తుచేశారు. తెలంగాణ గ్రేహౌండ్స్ స్ఫూర్తితో దేశంలోని ఇతర రాష్ట్రాలు సైతం ప్రత్యేక దళాలను ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. అక్టోబర్ 31న గుజరాత్‌లోని కెవాడియాలో నిర్వహించిన జాతీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో తెలంగాణ గ్రేహౌండ్స్ కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని డీజీపీ ప్రశంసించారు. గ్రేహౌండ్స్ సిబ్బంది సంఖ్య కనీసం 700 మందికి తగ్గకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో యుద్ధ శిక్షణ, కర్రెగుట్టల ప్రాంతంలో సాధన, ఆయుధ వినియోగంలో నైపుణ్యాన్ని నిరంతరం మెరుగుపరచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరి 2 నుంచి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో నిర్వహించనున్న అఖిల భారత పోలీసు కమాండో పోటీల్లో తెలంగాణ గ్రేహౌండ్స్ ప్రథమ స్థానం సాధించాలని డీజీపీ ఆకాంక్షించారు. గత పోటీల్లో సాధించిన నాలుగో స్థానాన్ని అధిగమించి జాతీయ స్థాయిలో రాష్ట్ర పోలీసుల ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. శిక్షణ, షూటింగ్‌లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు. విధి నిర్వహణలో అమరులైన సందీప్, పవన్, శ్రీధర్ త్యాగాలకు గుర్తుగా నూతన షూటింగ్ హౌస్‌కు 'ఎస్పీఎస్ ఊదా షూట్ హౌస్'గా నామకరణం చేశారు. పరిశీలన, పరిస్థితుల అంచనా, నిర్ణయం, కార్యాచరణ అనే నాలుగు సూత్రాల ఆధారంగా కమాండోల సామర్థ్యాన్ని పెంపొందించేలా దీనిని రూపొందించారు. క్లిష్ట పరిస్థితుల్లో వేగంగా నిర్ణయాలు తీసుకుని సమర్థంగా స్పందించేందుకు ఈ శిక్షణ కేంద్రం ఉపయోగపడనుంది. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల అధిపతి, డీజీ ఆపరేషన్స్ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ సిబ్బందికి అత్యంత కఠినమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. శారీరక దృఢత్వం, ఆయుధ వినియోగం, కాల్పుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, ఏఎస్పీ ఫాతిమా, గ్రూప్ కమాండర్లు ఎండీ అష్ఫాక్, వెంకటేశ్వర్లు, స్క్వాడ్రన్ కమాండర్ రాజు, క్యాంపు కమాండెంట్ విద్యాసాగర్, డీఎస్పీ సలీం, అసిస్టెంట్ కమాండెంట్ ఎండీ షరీఫ్ బెగ్ తదితరులు పాల్గొన్నారు.

నిజమైన ఫాసిస్ట్ పార్టీ కాంగ్రెస్సే

ఎమర్జెన్సీ చీకటి రోజులను దేశం ఇంకా మరచిపోలేదు

వంద ఎన్నికల్లో ఓటమితో 'డిఫీట్ సెంచరీ' చేసిన రాహుల్

హైదరాబాద్లో జరిగింది పక్కా భారత వ్యతిరేక సమ్మిట్

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): దేశ చరిత్రలో అసలైన ఫాసిస్ట్, నియంతృత్వ పార్టీ కాంగ్రెస్సేనని, 18 నెలల ఎమర్జెన్సీ కాలంలో పత్రికా స్వేచ్ఛను కాలరాసి, ప్రజల ప్రాథమిక హక్కులను అణచివేసి, జయప్రకాష్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్ వంటి లక్షలాది మందిని చీకటి జైళ్లలో బంధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కిషన్ రెడ్డి గుర్తు చేశారు.బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ఫాసిస్ట్ ప్రభుత్వం అని విమర్శించిన రాహుల్ గాంధీపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ద్వారా తెలంగాణకు పెట్టుబడులు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతుండటాన్ని ఎద్దేవా చేశారు. ఒకవైపు రాహుల్ గాంధీ వేదికపై నిలబడి 'భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది, ఎన్నికలు ఫ్రాడ్, దేశం ఫాసిస్టుల చేతిలో ఉంది' అని విదేశీయుల ముందు ఉపన్యాసాలు ఇస్తుంటే.. ఫాసిస్టుల పాలనలో ఉన్న దేశానికి విదేశీ పెట్టుబడులు ఎలా వస్తాయో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఇస్తున్న ప్రకటనలకు, సదస్సుకు పిలిచిన వ్యక్తులకు, రాహుల్ గాంధీ ప్రసంగాలకు కనీసం ఒక్క శాతం కూడా సంబంధం లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు బహుళజాతి కంపెనీలు, డేటా సెంటర్లు, పెట్టుబడులు వస్తున్నాయంటే అది రేవంత్ రెడ్డినో, డి.కె. శివకుమార్‌నో, రాహుల్ గాంధీనో చూసి కాదని.. గుజరాత్ సీఎంగా నరేంద్ర మోదీ ప్రారంభించిన ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ స్ఫూర్తి, నేడు కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వ సుపరిపాలన, అనుకూల వాతావరణం వల్లేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల పన్నుల సొమ్మును దుర్వినియోగం చేసి, విదేశీయులకు ఫస్ట్ క్లాస్ విమాన టికెట్లు ఇచ్చి, స్టార్ హోటళ్లలో పెట్టి మేపి నిర్వహించిన ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి ఒరిగిందేంటో రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ వేదికగా జరిగింది 'భారత్ సమ్మిట్' కాదని, అది ముమ్మాటికీ 'భారత వ్యతిరేక సమ్మిట్' అని ఆరోపించారు. వంద ఎన్నికల్లో ఓడిపోయి 'డిఫీట్ సెంచరీ' కొట్టిన రాహుల్ గాంధీ.. పిట్టల దొరలాగా మాట్లాడుతూ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికలు, మహారాష్ట్ర ఎన్నికలన్నీ ఫ్రాడ్ అని ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. పన్నెండేళ్లుగా మోదీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఎందుకు రావడం లేదని ఆశ్చర్యపోతూ ఈవీఎంలు, ఎన్నికల కమిషన్, హైకోర్టు, సుప్రీంకోర్టు, భారత సైన్యం, లోక్‌సభ, రాజ్యసభ, చివరకు దేశ భద్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జాతీయ భద్రతా సలహాదారుపై కూడా విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉగ్రవాదులు, తీవ్రవాదులు, నక్సలైట్లతో అంటకాగిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని.ఛత్తీస్‌గఢ్‌లో ఒకేసారి 74 మంది జవాన్లను నక్సలైట్లు పొట్టనపెట్టుకుంటే కనీసం సంతాపం కూడా తెలపకుండా, తుపాకీ రాజ్యం కావాలనే వారికి లిప్ సింపతీ చూపిన చరిత్ర రాహుల్ గాంధీదని విమర్శించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశంలో మతకలహాలు, బాంబు పేలుళ్లు, వేర్పాటువాదం, రాళ్ల దాడులు లేకుండా ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేశామని గుర్తుచేశారు. విదేశీయుల వీసాల రద్దుపై కాంగ్రెస్ చేస్తున్న రాద్ధాంతాన్ని తిప్పికొట్టారు. జర్మనీ నుంచి భారత ప్రధానిని, దేశ ప్రజాస్వామ్యాన్ని అవమానించే వ్యక్తులకు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికే కుసంస్కారం బీజేపీ ప్రభుత్వానికి లేదని తేల్చిచెప్పారు. దేశ విభజన సమయంలో లక్షలాది మంది హిందువుల ఊచకోత జరుగుతున్నా పట్టించుకోకుండా పదవుల కోసం పాకులాడిన నెహ్రూ కుటుంబ పాపం నేటికీ దేశాన్ని పట్టి పీడిస్తోందని, జకీర్ నాయక్ వంటి మత విద్వేషకులకు వీసాలు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు. తాను మోదీకి బానిస అని రేవంత్ రెడ్డి విమర్శించడంపై స్పందిస్తూ ప్రధానమంత్రి నాయకత్వంలో మంత్రులందరూ కలిసి పనిచేయడం రాజ్యాంగబద్ధమైన సంప్రదాయమని, రేవంత్ లాగా వారానికోసారి సూట్‌కేసులు మోసుకుంటూ ఢిల్లీకి వెళ్లి అధిష్ఠానానికి కప్పం కట్టే సంస్కృతి తమది కాదని బదులిచ్చారు.

కాంగ్రెస్ హామీల అమలులో పూర్తిగా విఫలం: కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 14 (చురకలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఈ అంశంపై పలు ప్రశ్నలు సంధించారు. మేనిఫెస్టో, వివిధ డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు నమ్మకం కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటిని పట్టించుకోవడం లేదని ఎక్స్ వేదికగా ఆరోపించారు. తెలంగాణ ఖజానా ఖర్చుతో రాష్ట్రానికి వచ్చిన రాహుల్ ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించి, మూడేళ్లలో రూ.5 వేల కోట్లలోపే ఖర్చు చేశారని ఆరోపించారు. విద్య, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ నెరవేరలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ పేద కుటుంబాలకు అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు అందిస్తామని చెప్పి అమలు చేయలేదని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 31 శాతం రిజర్వేషన్ల హామీ కూడా కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. యూత్ డిక్లరేషన్‌లో 365 రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి, ఇప్పటివరకు 10 వేల ఉద్యోగాలే ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. రాజీవ్ యువ వికాసం, ఐదు లక్షల విద్యా భరోసా కార్డుల హామీల అమలులోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. మైనార్టీలకు బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, రూ.వెయ్యి కోట్లలోపే ఖర్చు చేశారని విమర్శించారు. కాంగ్రెస్ నెరవేర్చని హామీల జాబితా అంతులేనిదని వ్యాఖ్యానించారు. మరోవైపు, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బడ్జెట్ల పనితీరును సమీక్షించి జవాబుదారీగా నిలదీయాలని రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. బడ్జెట్ ప్రకటనలకే పరిమితం కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో ప్రశ్నించాలని అన్నారు. పేద కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ఇప్పటికీ ప్రభుత్వ హామీల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.



దేశంలో ఫోన్ ట్యాపింగ్ వాస్తవమే..

నా ఫోన్‌పైనా నిఘా పెట్టారు: ప్రశాంత్ కిశోర్

పెగాసస్ నిఘా జాబితాలో తన పేరు కూడా ఉందని వెల్లడించిన జన్‌సురాజ్ వ్యవస్థాపకుడు

పట్నా, నవంబర్ 14 (చురకలు): దేశంలో ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నదనేది అక్షరాలా వాస్తవమేనని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, బిహార్ శాసనసభ్యుడు ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్నేళ్ల క్రితం దేశవ్యాప్తంగా కలకలం రేపిన 'పెగాసస్' స్పైవేర్ వివాదం వెలుగులోకి వచ్చిన సమయంలో తన ఫోన్‌పైనా నిఘా ఉంచారని ఆయన వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం పట్నాలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ప్రశాంత్ కిశోర్ ఈ మేరకు స్పందించారు. ప్రజలకు నిజాలు తెలియాలి:దేశంలో కొంతకాలంగా ఫోన్ల ట్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నిఘా వ్యవహారం గురించి దేశ ప్రజలందరికీ కచ్చితంగా తెలియాలని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. "ఫోన్ల ట్యాపింగ్ అనేది దేశంలో ఒక వాస్తవం. ఇది కొంతకాలం నుంచి జరుగుతోంది. గతంలో పెగాసస్ దృష్టిసారించిన ప్రముఖుల జాబితాలో నా పేరు కూడా ఉన్నట్లు బయటపడిన తర్వాతే, నా ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందనే విషయం నాకు తెలిసింది" అని ఆయన వివరించారు. సమ్రాట్ చౌధరీతో భేటీపై ఘాటు స్పందన:ఇదే సమయంలో, తాను నిత్యం తీవ్రస్థాయిలో విమర్శించే బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీతో ఇటీవల ఓ కార్యక్రమంలో కలవడంపై వస్తున్న ఊహాగానాలపైనా ప్రశాంత్ కిశోర్ స్పందించారు. ఒక శ్రాద్ధ కార్యక్రమానికి హాజరైనప్పుడు ఎదురుపడటంతో సామాజిక, రాజకీయ మర్యాద ప్రకారమే తాను ఆయనతో మాట్లాడానని స్పష్టం చేశారు. "కేవలం మర్యాదపూర్వకంగా భేటీ అయినంత మాత్రాన.. ఏదో తరగతి కూడా ఉత్తీర్ణుడు కాలేకపోయిన వ్యక్తిని పీహెచ్‌డీ చేసిన మేధావిగా పరిగణించినట్లు కాదు" అని ప్రశాంత్ కిశోర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో తాను ఆయనపై చేసిన విమర్శలు, ఆరోపణల విషయంలో ఎలాంటి మార్పు లేదని, వ్యక్తిగత ద్వేషాలు లేకపోయినా బిహార్ అభివృద్ధి కోసం తన పోరాటం కొనసాగుతుందని ఆయన తేల్చిచెప్పారు.

కశ్మీర్‌లో పోలీసుల హత్యల వెనుక కుట్ర?

మసీదు నుంచి బెదిరింపులంటూ బీజేపీ ఎమ్మెల్యే ఆరోపణలు!

కిష్ట్వార్‌లో ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారుల హత్య కలకలం

ఉగ్రవాదుల ఆచూకీకి రూ.30 లక్షల నజరానా ప్రకటన

కిష్ట్వార్, నవంబర్ 14 (చురకలు): జమ్మూకశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలో ఇద్దరు ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్‌పీఓలు) హత్యకు గురైన ఘటన రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ హత్యల వెనుక స్థానికంగా కుట్ర జరిగి ఉండవచ్చని బీజేపీ ఎమ్మెల్యే షుగన్ పరిహార్ అనుమానం వ్యక్తం చేశారు. మృతులకు గతంలో స్థానిక మసీదు నుంచి బెదిరింపులు వచ్చాయని ఆరోపించారు. అప్పట్లో ఆ బెదిరింపులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన పోలీసుల స్వగ్రామం కియార్‌ను ఎమ్మెల్యే షుగన్ పరిహార్, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ప్రతిపక్ష నేత సునీల్ శర్మ సందర్శించారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం పరిహార్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఉగ్రవాదులకు ఎవరైనా సమాచారం అందిస్తున్నారా అనే కోణంలోనూ దర్యాప్తు జరపాలని కోరారు. భద్రతా ఏర్పాట్లలో లోపాలు ఉన్నాయా, ఉన్నతాధికారుల స్థాయిలో నిర్లక్ష్యం జరిగిందా అనే అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అయితే మసీదు నుంచి బెదిరింపులు వచ్చాయన్న ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ వెలువడలేదు. జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్స్ బృందంలో పనిచేస్తున్న బాబీ చంద్ (57), రష్పాల్ కుమార్ (45) నవంబర్ 11న విధుల నిమిత్తం బయలుదేరి అదృశ్యమయ్యారు. మరుసటి రోజు అటవీ ప్రాంతంలో తూటా గాయాలతో వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. వారి వద్ద ఉన్న ఆయుధాలు కనిపించకపోవడంతో భద్రతా బలగాలు విస్తృత గాలింపు చేపట్టాయి. ఘటనా స్థలంలో పాకిస్థాన్‌లో తయారైనట్లు అనుమానిస్తున్న ప్రత్యేక తూటాలు లభ్యమైనట్లు సమాచారం. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించేందుకు భద్రతా బలగాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. ముగ్గురు అనుమానిత ఉగ్రవాదుల ఆచూకీ తెలిపిన వారికి రూ.30 లక్షల నజరానా ప్రకటించినట్లు సమాచారం. ఇద్దరు పోలీసుల హత్యలకు దారితీసిన పరిస్థితులు, బెదిరింపుల ఆరోపణలు, స్థానిక సహకారం తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.



మోదీ స్వయంగా ఫోన్లు ట్యాప్ చేయరు

- రాహుల్‌కు భిన్నంగా పిట్రోడా వ్యాఖ్యలు!
- ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌లో భిన్న స్వరాలు
- ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు
- న తన ఫోన్, ల్యాప్‌టాప్‌పైనా నిఘా ఉందన్న సామ్ పిట్రోడా
- రాహుల్ ఆరోపణలను తోసిపుచ్చిన బీజేపీ నేతలు



న్యూఢిల్లీ, నవంబర్ 14 (చురకలు): నరేంద్ర మోడీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారంటూ రాహుల్ గాంధీ చేసిన సంచలన ఆరోపణలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయితే, రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు భిన్నంగా ఆ పార్టీ సీనియర్ నేత, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఛైర్మన్ సామ్ పిట్రోడా స్పందించడం ఆసక్తికరంగా మారింది. ప్రధాని మోడీ స్వయంగా ఫోన్లు ట్యాప్ చేయరని తాను భావిస్తున్నట్లు పిట్రోడా వ్యాఖ్యానించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై మీడియా అడిగిన ప్రశ్నకు సామ్ పిట్రోడా సమాధానమిస్తూ.. "ప్రధాని మోడీ అలా చేయరని నేను భావిస్తున్నాను. ఆయన స్వయంగా స్క్రూడ్రైవర్ పట్టుకుని కంప్యూటర్ దగ్గర కూర్చుని ఫోన్లు ట్యాప్ చేయరు" అని పేర్కొన్నారు. అయితే, ఇదే సమయంలో తన వ్యక్తిగత పరికరాల భద్రతపై ఆయన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. తన ఫోన్ ట్యాప్ అవుతోందని, తన ల్యాప్‌టాప్, బ్యాంక్ అకౌంట్లపై నిఘా ఉందని అనుమానంగా ఉందని పిట్రోడా తెలిపారు. ఈ విషయాన్ని తాను టెక్ నిపుణులతో పరిశీలింపజేశానని, తన డివైజ్‌లపై నిఘా ఉండే అవకాశం ఉందని వారు కూడా హెచ్చరించినట్లు ఆయన వివరించారు. కాగా, తన ఫోన్‌ను ఎవరు ట్యాప్ చేస్తున్నారనే విషయంపై మాత్రం ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అంతకుముందు శుక్రవారం నాడు రాహుల్ గాంధీ ప్రధాని మోడీని ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని, దీనికి సంబంధించిన సమాచారం గురించి ఆయనకు ముందే తెలుసని రాహుల్ ఆరోపించారు. ప్రధాని తనతో ముఖాముఖి చర్చకు అంగీకరించిన రోజు.. విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరు ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకి? ఎవరు దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు? అనే అసలు నిజాలన్నీ దేశ ప్రజలందరికీ తెలుస్తాయని రాహుల్ సవాల్ విసిరారు.

రాహుల్ ఆరోపణలను కొట్టిపారేసిన బీజేపీ

మరోవైపు, రాహుల్ గాంధీ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతలు తీవ్రంగా ఖండించారు. కేవలం రాజకీయ ప్రాధాన్యం పొందేందుకే ఎలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై బీజేపీ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఘాటుగా స్పందించారు. రాహుల్ గాంధీ ముందుగా తన మానసిక పరిస్థితిని పరీక్షించుకోవాలని ఎద్దేవా చేశారు. ఆయన ఫోన్ ట్యాప్ చేయడంపై ఎవరికీ ఏమాత్రం ఆసక్తి లేదని, కానీ ఆయన మెదడు రోజూ ఎందుకు అబద్ధాలు చెబుతుందో తెలుసుకోవాలనే ఆసక్తి మాత్రం ప్రజలకు ఉండొచ్చని రాజీవ్ చంద్రశేఖర్ విమర్శించారు.

హామీ ఇస్తేనే హసీనాను పంపిస్తాం

బంగ్లాదేశ్‌కు భారత్ రెండు కీలక షరతులు!

మరణశిక్షపై అప్పీల్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్

న్యూఢిల్లీ/ఢాకా, నవంబర్ 14 (చురకలు): బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను స్వదేశానికి అప్పగించే విషయంలో భారత్ కీలక షరతులు విధించినట్లు తెలుస్తోంది. 2024 ఆగస్టులో జరిగిన హింసాత్మక ఆందో ళనల అనంతరం పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనా.. వచ్చే నెల (డిసెంబర్)లో తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో అక్కడ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మానవత్వానికి వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాలపై బంగ్లాదేశ్ ప్రత్యేక ట్రైబ్యునల్ ఇప్పటికే ఆమెకు మరణశిక్ష విధించింది. ఈ క్రమంలో ఆమెను అప్పగించాలంటే తమకు స్పష్టమైన గ్యారెంటీ ఇవ్వాలని భారత్ బంగ్లాదేశ్ ప్రభుత్వం ముందు రెండు ప్రధాన షరతులను ఉంచినట్లు 'బీబీసీ బంగ్లా' కథనం వెల్లడించింది. షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు పంపించే విషయంలో న్యూఢిల్లీ స్పష్టమైన వైఖరితో ఉన్నట్లు సమా చారం. మొదటి షరతు ప్రకారం.. హసీనాను తిరిగి బంగ్లాదేశ్ తీసుకెళ్లే పూర్తి బాధ్యతను ఆ దేశ సైన్యమే తీసుకోవాలి. 2024 ఆగస్టు 5న ఆమె బంగ్లాదేశ్ సైనిక విమానంలో భారత్‌కు వచ్చిన తరహాలోనే, ఇప్పుడు కూ డా విమాన మార్గంలో ఢిల్లీ నుంచి తీసుకెళ్లినా లేదా భూ మార్గం ద్వారా సరిహద్దు దాటినా బంగ్లా సైన్యమే ఆమెను రిసీవ్ చేసుకోవాలని భారత్ కోరుతోంది. ఇందుకు అవసరమైన రవాణా, భద్రతా ఏర్పాట్లలో పూర్తి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. ఇక రెండో షరతు ప్రకారం.. బంగ్లాదేశ్ కోర్టులు హసీనాకు విధించిన మరణశిక్షపై అప్పీల్ చేసుకునే చట్టబద్ధమైన అవకాశం కల్పించడంతో పాటు, ఈ కేసును నిష్పక్షపాతంగా పునర్విచారణ జరపాలని భారత్ స్పష్టం చేసింది. కేవలం ఉరితీయడానికి తెలిసి తెలిసి ఆమెను అప్పగించలేమని, న్యాయమైన విచారణకు అవకాశం లభించాలన్నదే తమ ఉద్దేశమని భారత విదేశాంగ శాఖ వర్గాలు పేర్కొన్నట్లు కథనం తెలిపింది. హసీనా తిరుగు ప్రయాణంపై భారత్, బంగ్లాదేశ్ మధ్య తెరవెనుక మంతనాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో ఇరు దేశాల సైనిక వ్యవస్థలు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇందులో భాగంగానే అక్టోబర్ మొదటి వారంలో బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషనర్ దినేశ్ త్రివేది ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీతో పాటు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేత్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లే సమయంలో బంగ్లా సైన్యం చురుకైన పాత్ర పోషించేలా చూడటమే ఈ భేటీ వెనుక ప్రధాన ఉద్దేశ మని భారత సైనిక వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, ప్రవాసంలో ఉన్న షేక్ హసీనా నవంబర్ 9న కొత్త పాస్‌పోర్ట్, జాతీయ



గుర్తింపు కార్డు (ఎన్ఐడీ) కోసం ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. పదవి కోల్పోయిన తర్వాత ఆమె బంగ్లా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం ఇదే తొలిసారి. అయితే, ఆమె దరఖాస్తుపై ఢాకా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అప్పగింత ఒప్పందం కింద ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ నేతలు డిమాండ్ చేస్తుండగా, పాస్‌పోర్ట్ దరఖాస్తు ద్వారా హసీనా బంతిని బంగ్లా ప్రభుత్వం కోర్టులోకి నెట్టారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ ప్రెస్ సెక్రటరీ కేఎం నజ్ముల్ హక్ శుక్రవారం ఫేస్‌బుక్ వేదికగా స్పందిస్తూ.. బ్రిటన్, అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, ఫిన్లాండ్, బెలారస్, ఖతార్ సహా ఆఫ్రికా దేశాల్లో ఏ ఒక్కటీ హసీనాకు ఆశ్రయం ఇవ్వడానికి ముందుకు రాలేదని ఆరోపించారు. అన్ని దారులు మూసుకుపోయిన తర్వాతే ఆమె గత్యంతరం లేక బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని చూస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రెస్‌మీట్‌లో ఒక వ్యక్తిని ముద్దుపెట్టుకున్న బీజేపీ ఎమ్మెల్యే

ఏఐ వీడియో అని ఆయన భార్య ఆరోపణ

భువనేశ్వర్: మీడియా సమావేశంలో మంత్రి ప్రసంగిస్తుండగా ఒక బీజేపీ ఎమ్మెల్యే తన పక్కన ఉన్న వ్యక్తిని ముద్దు పెట్టుకున్నారు. అతడిని కౌగిలించునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లుగా ఉన్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే అది ఏఐ వీడియో అని ఆ ఎమ్మెల్యే భార్య ఆరోపించారు. బీజేపీ పాలిత ఒడిశాలో ఈ సంఘటన జరిగింది. గురువారం గంజాం జిల్లాలో వరద ప్రభావంపై మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద మాలిక్ మీడియాతో మాట్లాడారు. 2024లో మొదటిసారి అసెంబ్లీకి ఎన్నికైన చికితీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సమంత్రా, ఆ మంత్రి వెనుక నిల్చొని ఉన్నారు. అయితే పక్కనే ఉన్న వ్యక్తిని ముద్దు పెట్టుకోవడానికి, కౌగిలించుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్లుగా ఉన్న ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా, ఒడిశాలోని ప్రతిపక్ష బీజేడీ ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో షేర్ చేసింది. 'గంజాం జిల్లా వరదల్లో మునిగిపోతుంటే, బీజేపీ నాయకులు మాత్రం ఆనందంతో గెంతుతున్నారు' అని విమర్శించింది. అయితే బీజేపీ అధికార ప్రతినిధితో పాటు ఆ ఎమ్మెల్యే కూడా ఈ వీడియో క్లిప్‌పై స్పందించలేదు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సమంత్రా భార్య మీనా సాహు ఈ వీడియోపై స్పందించారు. వైరల్ అవుతున్న ఈ క్లిప్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి మార్ఫింగ్ చేశారని ఆమె ఆరోపించారు. అదే విలేకరుల సమావేశానికి సంబంధించిన మరో వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. అదే అసలైన ఫుటేజ్ అని, మంత్రి ప్రసంగాన్ని ఎమ్మెల్యే చాలా శ్రద్ధగా వింటున్నారని ఆమె పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సమంత్రా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఏఐ సాంకేతికతతో సృష్టించిన వీడియో క్లిప్‌ను బీజేడీకి చెందిన చికితీ సోషల్ మీడియా బృందం ప్రచారం చేస్తోందని ఆయన భార్య మీనా ఆరోపించారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బెర్హంపూర్ పోలీసులను ఆమె కోరారు.



70 మంది అమ్మాయిలకు వేధింపులు

బ్రిటన్‌లో భారతీయుడికి 30 ఏళ్ల జైలుశిక్ష

లండన్: ముంబైకి చెందిన 27 ఏళ్ల బిలాల్ ఖాజీ అనే వ్యక్తికి .. బ్రిటన్‌లో 30 ఏళ్ల జైలుశిక్ష పడింది. సుమారు 70 మంది అమ్మాయిలను అతను వేధించాడు. అమ్మాయిలకు చెందిన శృంగారభరిత వీడియోలు, ఇమేజ్‌లు అతని వద్ద ఉన్నాయి. 10 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న గర్ల్స్‌ను బిలాల్ టార్గెట్ చేశారు. స్నాప్‌చాట్, వింక్, రాబ్‌లాక్స్ లాంటి సోషల్ మీడియా, గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను అతను వాడాడు. 2021 నుంచి 2025 మధ్య కాలంలో అతను అమ్మాయిలను వేధించినట్లు తెలుస్తోంది. కనీసం 20 ఏళ్ల అతను జైలు జీవితాన్ని అనుభవించాలి. ఆ తర్వాత అతను పెరోల్‌కు అర్హుడు అవుతాడు. కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసేందుకు ఖాజీ బ్రిటన్ వెళ్లాడు. 37 అభియోగాలు నమోదు అయ్యాయి. చెస్టర్ క్రౌన్ కోర్టులో అతన్ని బంధించారు. అసభ్యకర చిత్రాలు పంపడం, బ్లాక్‌మెయిలింగ్ చేయడం, చిన్నారులను లైంగికంగా రెచ్చగొట్టినట్లు ఖాజీపై ఆరోపణలు ఉన్నాయి. ఓ బాధితురాలు 2021 డిసెంబర్‌లో డెర్బిషైర్ పోలీసుల్ని ఆశ్రయించడంతో ఖాళీ బాగోతం బయటపడింది. ఖాజీతో స్నాప్‌చాట్‌లో మాట్లాడేదాన్ని అని ఓ 13 ఏళ్ల అమ్మాయి ఫిర్యాదు చేసింది. అయితే నిందితుడు ఖాజీ తాను కూడా 14 ఏళ్ల వ్యక్తినే అని చెప్పుకుంటూ ఆ వయసున్న అమ్మాయిలను ట్రాప్ చేశాడు. పరిచయం కాగానే, సెక్సువల్ సంభాషణ చేయడం, ఆ తర్వాత అసంబద్ధమైన ప్రశ్నలు వేసి, అమ్మాయిలను బ్లాక్‌మెయిల్ చేసేవాడని తెలిసింది. అయితే తనకు షేరింగ్ చేసిన ఫోటోలు, వీడియోలను సర్క్యూలేట్ చేస్తానని బెదిరించేవాడని ఓ అమ్మాయి తన ఫిర్యాదులో చెప్పింది. ఖాజీ బాధితుల్లో 180 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతని వద్ద ఉన్న డివైస్ నుంచి కీలక సమాచారాన్ని రాబట్టారు. బాధితుల్లో 11 నుంచి 17 ఏళ్ల వయసున్న అమ్మాయిలు సుమారు 70 మంది ఉంటారని అధికారులు చెప్పారు.



నెహ్రూ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 14, :

భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శనివారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాదులని, వారి అభిరుచులు, ఆశయాలకు తగిన ప్రోత్సాహం అందిస్తూ విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. బాలలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- సభా ప్రాంగణ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్
- నవంబర్ 19న సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 14, :

ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో సభా ప్రాంగణం వద్ద చేపడుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో శనివారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సభా వేదిక వద్ద కొనసాగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సభా ప్రాంగణం పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

హైదరాబాద్, నవంబర్ 14, :



హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో శనివారం నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో భాగంగా 'ఫ్యూచరింగ్ ఏ న్యూ వరల్డ్' పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న పరిస్థితులు, నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అభివృద్ధి అవకాశాలు, భవిష్యత్తు ప్రపంచ నిర్మాణంలో వివిధ రంగాల పాత్ర వంటి కీలక అంశాలపై ఈ సమ్మిట్‌లో చర్చించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు అవసరమైన నూతన ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు, వివిధ రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, సాంకేతిక అభివృద్ధి ద్వారా అందుబాటులోకి వస్తున్న అవకాశాలపై ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

శ్రీవాణి పాఠశాలలో అట్టహాసంగా బాలల దినోత్సవ వేడుకలు

- చాచా నెహ్రూ వేషధారణలో అలరించిన చిన్నారులు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :

భారత్‌నగర్‌లోని శ్రీవాణి పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ముందస్తుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. చిన్నారుల కేరింతలు, ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, రంగురంగుల వేషధారణలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు చాచా నెహ్రూ వేషధారణతో పాటు వివిధ రకాల ఆకర్షణీయమైన వేషధారణల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో సుమారు 220 మంది విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ఇతర కళారూపాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు తమలోని ప్రతిభను వేదికపై అద్భుతంగా ఆవిష్కరించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ సత్యం మాట్లాడుతూ పిల్లలంటే అమితమైన ప్రేమాభిమానాలు కలిగిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 16వసారి వేడుకలను ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు కళలు, క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు రాణించేలా పాఠశాల ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. చిన్నారుల ఆనందోత్సాహాల మధ్య సాగిన ఈ వేడుకలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దాతల దాతృత్వం అభినందనీయం

సర్పంచ్ భవాని నవీన్ కుమార్

చిన్నకోడూరు, నవంబర్ 13, :

చిన్న కోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాల యూకేజీ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన దాతల దాతృత్వం అభినందనీయమని సర్పంచ్ భవాని నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం రామంచ ప్రాథమిక పాఠశాలలో దాత నాగప్రసాద్ రూ.7,500 ఆర్థిక సహాయంతో యూకేజీ విద్యార్థులు 25 మందికి స్కూల్ బ్యాగులు, అందరికీ మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రామంచ ప్రాథమిక పాఠశాల ప్రైవేటుకు దీటుగా పనిచేస్తుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చి ఉన్నత స్థాయికి చేరుకొని గ్రామానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. దాతలు దాతృత్వాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తవ్వ సూచించారు. దాత నాగప్రసాద్ మాట్లాడుతూ సేవ చేయడం అంటే నాకు ఎంతో ఇష్టమని రామంచ పాఠశాలకు మరి ఏదైనా సహాయం చేసేందుకు ముందు ఉంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి బాలల దినోత్సవం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో



పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైవి సురేష్ కుమార్, ఉపాధ్యాయులు సునీత అబేదా బేగం, వరప్రసాద్, స్వరూప, స్వప్న , కళ్యాణి, రమ్య సిబ్బంది లావణ్య, పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక ప్రమాణాలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

- నిరుపేద కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణం
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- కిష్టాపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :

చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ గ్రామంలో పండుగ వెంకవ్వ, ఆంజనేయులుకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల సమక్షంలో



రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా మీసం మహేందర్ యాదవ్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన, గుణాత్మక ప్రమాణాలు పాటించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చేలా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సందబోయిన పరశురాం, ఏఎంసీ డైరెక్టర్లు పాకాల భూపతిరెడ్డి, మహమ్మద్ సలీం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లింగంపల్లి నాగరాజు, పసుపుల బాబు, గొల్లపల్లి కిష్టయ్య, పండుగ శంకర్, సీనియర్ నాయకులు పొన్నాల రాజేష్, గొట్టిపర్తి చందు, పంతం శ్రీనివాస్, గుండు వెంకట్, మెటపల్లి ఉపసర్పంచ్ మహేష్, నక్క రాజు, సంపత్, స్వామి, రాజు కుమార్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ పాఠశాలలో ఘనంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలు

- మహనీయుల అడుగుజాడల్లో నడిచి సమాజానికి దిశానిర్దేశకులుగా ఎదగాలి
- బిస్మాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 14, :

భావిభారత పౌరులైన చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో జాతీయ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలకు బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బిస్మాట్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తుకు పునాదులని, నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణకర్తలని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని, వారి అడుగుజాడల్లో పయనించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర విద్యాభ్యాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కేవలం చదువులోనే కాకుండా నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథంలోనూ రాణిస్తూ సమాజానికి దిశానిర్దేశం చేసే గొప్ప వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు వివిధ జాతీయ నాయకులు, మహనీయుల వేషధారణలతో అలరించారు. రంగురంగుల సంప్రదాయ దుస్తులు, ఆకట్టుకునే వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. చిన్నారుల ప్రతిభ, చురుకుదనం, అభినయ నైపుణ్యం సభికులను విశేషంగా ఆకట్టుకోగా, పలువురు విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా వేషధారణ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో పాటు వివిధ



సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులను జగ్గు మల్లారెడ్డి అభినందించి, బహుమతులు అందజేశారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి అండగా కల్వకుంట్ల వంశీధర్ రావు

- దగ్ధమైన కిరాణా దుకాణం పునర్నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని భరోసా
- ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్న వంశీధర్ రావు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 14, :

సిద్దిపేట పట్టణంలోని 1వ వార్డు లింగారెడ్డిపల్లిలో జీవనోపాధి కోసం చిన్నపాటి కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న బొల్లు శివానికి దీపావళి పండుగ రోజు తీవ్ర విషాదం ఎదురైంది. హనుమాన్ ఆలయం సమీపంలో ఆమె నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి షాపు పూర్తిగా దగ్ధమైంది. ఈ



ఘటనలో దుకాణంలోని సరుకులు, ఇతర సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో సుమారు రూ.3 లక్షల మేర ఆర్థిక నష్టం వాటిల్లింది. దీంతో జీవనోపాధి కోల్పోయి ఆమె కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి శనివారం చేరుకుని అగ్నిప్రమాదంలో దగ్ధమైన కిరాణా దుకాణాన్ని పరిశీలించారు. బాధితురాలు బొల్లు శివానిని పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ధైర్యం చెబుతూ జీవనోపాధికి ఆధారమైన దుకాణం అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోవడం బాధాకరమని అన్నారు. అయితే అధైర్యపడవద్దని, తిరిగి దుకాణాన్ని పునర్నిర్మించుకుని వ్యాపారం కొనసాగించేందుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ, జీవనాధారాన్ని కోల్పోయిన బాధితురాలికి భరోసా కల్పించడం స్థానికంగా పలువురి ప్రశంసలు అందుకుంది. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కల్వకుంట్ల వంశీధర్ రావు చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి
- స్కానింగ్ సెంటర్లలో జిల్లా ఉప వైద్యాధికారి ఆకస్మిక తనిఖీలు

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, :

జగిత్యాల పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను బుధవారం జిల్లా ఉప వైద్యాధికారి, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీపీఎన్డిటీ యాక్ట్ 1994) ప్రకారం గర్భస్థ శిశువు ఆడ లేదా మగ అని నిర్ధారించి వెల్లడించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్లలో వినియోగిస్తున్న అల్ట్రాసౌండ్ యంత్రాలు, వైద్యుల అర్హత ధ్రువీకరణ పత్రాలు సంబంధిత అధికారులు మంజూరు చేసిన అనుమతులు, దరఖాస్తుల ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ప్రతి నెల 5వ తేదీలోపు ఫారం–ఎఫ్ వివరాలను సంబంధిత పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఫారం–ఎఫ్ వివరాలు, ఆఫ్‌లైన్ రికార్డుల్లోని వివరాలు ఒకే విధంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా స్కానింగ్ సెంటర్లలో పేషెంట్లకు స్పష్టంగా కనిపించే విధంగా “ఇక్కడ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేయబడదు. లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోబడతాయి” అనే హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పీసీపీఎన్డిటీ చట్ట నిబంధనలను ఉల్లంఘించి గర్భస్థ శిశు లింగ నిర్ధారణకు పాల్పడిన వారిపై జరిమానాతో పాటు చట్టప్రకారం జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. లింగ నిర్ధారణను ప్రోత్సహించే వ్యక్తులపై కూడా చట్టపరమైన



చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వైద్యుల వైద్య రిజిస్ట్రేషన్ రద్దుకు సైతం చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన సందర్భాల్లో సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి, చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డాక్టర్ జైపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జి డెమో ఏనుగంటి రాజేశం, జూనియర్ అసిస్టెంట్ వి. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల చోరీ ముఠా గుట్టురట్టు.. ఇద్దరు వ్యక్తుల అరెస్ట్..

- మద్యానికి బానిసై జల్సాల కోసం గొర్రెల చోరీ
- సంతలో విక్రయించేందుకు తీసుకురాగా పట్టుకున్న పోలీసులు
- ఆటో, మూడు గొర్రెలు, ఒక మేక స్వాధీనం

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 14, :

మద్యానికి బానిసై, జల్సాల కోసం గొర్రెలను చోరీ చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను దుబ్బాక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గొర్రెల చోరీ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులు గొర్రెలను



సంతలో విక్రయించేందుకు తీసుకొచ్చిన సమయంలో పట్టుకోవడంతో చోరీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ వివరాలను దుబ్బాక ఎస్సై కీర్తిరాజు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల దుబ్బాక మండలంలోని రామక్కపేట, పెద్దచీకోడ్ గ్రామ శివారులో ఉన్న గొర్రెల కొట్టాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఎనిమిది గొర్రెలను చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం దుబ్బాకలో నిర్వహించే మూగజీవాల సంతలో గొర్రెలను విక్రయించేందుకు ఇద్దరు వ్యక్తులు ఆటోలో తీసుకొచ్చారు. వారి ప్రవర్తన, అనుమానాస్పద కదలికలను గమనించిన పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో రామక్కపేట, పెద్దచీకోడ్ ప్రాంతాల్లో గొర్రెల చోరీకి పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను దుబ్బాక పట్టణానికి చెందిన పి శ్రీనివాస్, వి నాగరాజుగా గుర్తించారు. వారి వద్ద నుంచి ఒక ఆటో, మూడు గొర్రెలు, ఒక మేకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కీర్తిరాజు వెల్లడించారు.

బాలల గ్రామసభలు నిర్వహించడం సరే.. సమస్యలకు పరిష్కారాలేవి..

- పిల్లలు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కార గడువు నిర్ణయించాలి
- తీర్మానాలకే పరిమితమైతే గ్రామసభల ఉద్దేశం నెరవేరదు
- ప్రభుత్వం నిధులు కేటాయించి అమలు చేయాలి
- ఉప సర్పంచ్ రాజు

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 14, :

బాలల గ్రామసభలు నిర్వహిస్తున్నామని ప్రచారం చేసుకోవడం కంటే.. ఆ సభల్లో చిన్నారులు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం చూపించడమే ప్రభుత్వానిది అసలైన బాధ్యతని కాసులాబాద్ గ్రామ ఉప సర్పంచ్ రాజు స్పష్టం చేశారు. పిల్లలతో సమస్యలు చెప్పించి, తీర్మానాలు చేసి, వాటిని కాగితాలకే పరిమితం చేస్తే బాలల గ్రామసభల అసలు లక్ష్యం నీరుగారిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో శనివారం నిర్వహించిన బాలల గ్రామసభలో ఆయన మాట్లాడుతూ నామమాత్రంగా గ్రామసభలు నిర్వహించి సమస్యలను



తెలుసుకోవడం, అనంతరం తీర్మానాలకే పరిమితం కావడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. గత రెండు నెలల క్రితం నిర్వహించిన బాలల గ్రామసభలో విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కార గడువు



నిర్ణయించాలని, వాటి అమలుపై సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తూ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాలల గ్రామసభల్లో వచ్చిన సమస్యల్లో ఎన్ని పరిష్కారమయ్యాయి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎంతమేర నిధులు కేటాయించింది, అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తూతూమంత్రంగా గ్రామసభలు నిర్వహించడం వల్ల పిల్లల్లో ప్రజాప్రతినిధులు, అధికారులపై నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బాలల సమస్యలను వినడమే కాకుండా, వాటికి కార్యరూపంలో పరిష్కారం చూపినప్పుడే బాలల గ్రామసభలకు నిజమైన సార్థకత చేకూరుతుందని ఉప సర్పంచ్ రాజు పేర్కొన్నారు.

సెయింట్ పీటర్స్ టాలెంట్ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం

- విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం

గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 14, :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సెయింట్ పీటర్స్ టాలెంట్ స్కూల్లో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ ఫిలిక్స్ రజిని, కరస్పాండెంట్ సేవియర్ జ్యోతి బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, బాలల భవిష్యత్తు, సమాజంలో వారి బాధ్యతల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, డాన్సులు నిర్వహించగా, విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ, ప్రకృతి, పాఠశాల తదితర అంశాలపై ఆకట్టుకునే చిత్రాలు గీశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తు అని, ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, సమయపాలన అలవర్చుకొని ఉన్నత



లక్ష్యాలను సాధించాలని సూచించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల అభ్యున్నతి తోనే దేశం అభివృద్ధి

సర్పంచ్ బాలెంల శ్రీలత రామచంద్రరెడ్డి

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 14, :

బాలల అభ్యున్నతితోనే దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని హబ్షీపూర్ గ్రామ సర్పంచ్ బాలెంల శ్రీలత రామచంద్రరెడ్డి అన్నారు. శనివారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని దుబ్బాక మండలం హబ్షీపూర్ లో చిన్నారులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, పాఠశాలలో ఉన్నటువంటి ఎలాంటి సమస్యలైన తమ దృష్టికి తీసుకురావాలని, తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తామని విద్యార్థులకు తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లలకు నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం, చక్కటి నైతిక విలువలు అందించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందు తుందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి కలలను సాకారం చేసుకునేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్, చిన్నపిల్లలకి పెన్సిల్స్, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు



మెంబర్ రాజేంద్ రెడ్డి, గ్రామ సెక్రెటరీ వజ్రవ్య, అంగన్ వాడి టీచర్స్ మంజుల, బాల్ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తల్లి నగర్‌లో సమస్యల పరిష్కారానికి పాదయాత్ర

- యూజీడీ సమస్యపై స్పందన.. మ్యాన్‌హోల్స్ మరమ్మతు పనులు ప్రారంభం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని తెలుగు తల్లి నగర్‌లో నెలకొన్న స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలోని పలు సమస్యలను స్థానికంగా పరిశీలించి, ముఖ్యంగా యూజీడీ (భూగర్భ డ్రైనేజీ) సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శనివారం మ్యాన్‌హోల్స్ మరమ్మతు పనులు చేపట్టారు. తెలుగు తల్లి నగర్ అధ్యక్షులు తారాసింగ్, బద్రి నారాయణ స్థానిక బస్తీవాసులతో కలిసి దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తూ పూర్తి చేయించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపి, యూజీడీ సమస్యపై స్పందించి పనులు చేపట్టేందుకు కృషి చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్‌కు బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా మహిళా కార్యదర్శిగా రేవతి సింగ్ ఠాకూర్ నియామకం

- దేవేందర్ నగర్ లో ఘనంగా సన్మానం.. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్న రేవతి సింగ్ ఠాకూర్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా నూతన మహిళా కార్యదర్శిగా నియమితులైన రేవతి సింగ్ ఠాకూర్‌కు మహాదేవపురం డివిజన్ పరిధిలోని దేవేందర్ నగర్‌లో శనివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. మహాదేవపురం డివిజన్‌కు చెందిన తనకు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించి గుర్తింపు కల్పించిన పార్టీ నాయకులకు, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ లీగల్ సెల్ సభ్యులు శివానంద్ అడ్వకేట్, సీనియర్ నాయకులు బండారి శ్రీధర్, జగదీష్, యువ నాయకులు సాకేత్, గోపాల్, బీజేపీ నాయకులు సరోజిని, శ్రీవాణి, రవి తదితరులు పాల్గొని రేవతి సింగ్ ఠాకూర్‌కు అభినందనలు తెలిపారు.

మూసాపేటలో చిన్నారుల మధ్య బాలల దినోత్సవ సంబరాలు

- అంగన్వాడీ చిన్నారులతో కేక్ కట్ చేసి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం డి సలీం



కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 14, :

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం డి సలీం తన మిత్రబృందంతో కలిసి మూసాపేట జనతానగర్ బస్తీలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో బాలల దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. చిన్నారులతో కలిసి కాసేపు సరదాగా గడుపుతూ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎండి సలీం మాట్లాడుతూ చిన్నారుల చిరునవ్వులే రేపటి భవిష్యత్తుకు మార్గదర్శకాలని, పిల్లలే దేశ భవిష్యత్తుకు ఆశాకిరణాలని అన్నారు. ప్రతి చిన్నారికి మంచి విద్య, ఆరోగ్యం, ఆహ్లాదకరమైన బాల్యం అందించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. చిన్నారులతో కలిసి బాలల దినోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎండి సలీం మిత్రబృందం సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఏఎల్ ఆధ్వర్యంలో నిర్మించిన గురుకుల పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను శాలువాతో సత్కరించిన బండారి లేఅవుట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు వరగాని

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : కేంద్ర ప్రభుత్వ సంస్థ హెచ్ఏఎల్ కంపెనీ సౌజన్యంతో నిజాంపేట్ సర్కిల్ పరిధిలో సుమారు రూ.22.50 కోట్ల వ్యయంతో మూడు అంతస్తుల్లో అధునాతన వసతులతో నూతనంగా నిర్మించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాల భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి లేఅవుట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసు వరగాని మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మ తాతి రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రావూరి మౌలేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల బ్రహ్మాచారి, సంధ్య, రాజు, మురళీకృష్ణ, నారాయణ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సయ్యద్ రఫత్, మేడ వెంకట్, మధుసూదన్ రెడ్డి, సురేంద్ర కుమార్, రవీందర్ రెడ్డి, ఆదిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్ నియోజకవర్గంలో చేయూత కొత్త పెన్షన్ల పంపిణీ షురూ

- ఇల్లంతకుంటలో శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కవ్వంపల్లి
- మండలంలో 670 మందికి కొత్త పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ



మానకొండూర్/ఇల్లంతకుంట, నవంబర్ 13, : నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పథకం కింద కొత్త పెన్షనర్లకు మంజూరు పత్రాలను పంపిణీకి మానకొండూర్ నియోజకవర్గంలో శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వైశ్య భవన్ ఫంక్షన్ హాల్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇల్లంతకుంట మండలానికి చెందిన 670 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పెన్షన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, నిరుపేద కుటుంబానికి ధైర్యం, వయోవృద్ధులకు భరోసా, పేద తల్లులకు ఆత్మగౌరవమని పేర్కొన్నారు. పేదల కష్టాలకు అండగా నిలవడం, కులవృత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆసరా కల్పించడం, దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడమే చేయూత పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. కొత్త పెన్షన్ల మంజూరులో వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులకు ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. దివ్యాంగులు మరణించిన పక్షంలో వారి జీవిత భాగస్వామికి కూడా పెన్షన్ అందించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. ఇందిరమ్మ బీమాతో కుటుంబాలకు భరోసా, రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుందని ఎమ్మెల్యే తెలిపారు. సహజ మరణమైనా, ప్రమాదవశాత్తు మరణించినా ఉచిత బీమా కింద రూ.5 లక్షలు అందజేస్తారని వివరించారు. ప్రజలకు ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 19న సిరిసిల్లలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో లక్ష్మి రాజం, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, ఎంపీడీవో వై.శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఊట్కూరి వెంకట రమణారెడ్డి, స్థానిక సర్పంచ్ మామిడి రాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, ఏఎంసీ, పీఏసీఎస్ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంతోనే ప్రాంత అభివృద్ధికి బాటలు



- బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- కొంపల్లి సర్కిల్ పరిధిలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. సీఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధిలోని శ్వేతా శుభం కాలనీలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేశామన్నారు. వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు అనుగుణంగా కొంపల్లి పరిధిలోని అన్ని కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిచ్చి ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్వేతా శుభం చైర్మన్ సృజన్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సెక్రటరీ రమేష్ కుమార్, సంయుక్త కార్యదర్శి దామోదర్ పుట్ట, కోశాధికారి శివకుమార్ రెడ్డి, డైరెక్టర్లు వినయ్ కుమార్, సుబ్రజిత్ నాథ్, జోగి జోగారావు, వాణి, కాలనీ వాసులు, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణవేణి వినోద్ కుమార్, నాయకులు వేణు, ఎం.డి. ఖాదర్ (షన్ను భాయ్), కిట్టు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా అధ్యక్షునిగా టైగర్ రాజు

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 14, : బీజేపీ దళిత మోర్చా దుబ్బాక పట్టణ అధ్యక్షునిగా టైగర్ ఆస రాజును బీజేపీ అధిష్టానం శనివారం నియమించింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బీజేపీ అధిష్టానం తనపై నమ్మకంతో పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలో ఉన్న దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో మున్సిపల్ అధ్యక్షుడిగా నియమించి నందుకు మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



బాలల భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు

దమ్మపేట, నవంబర్ 14, : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. జవహర్‌లాల్ నెహ్రూకు చిన్నపిల్లలంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయన జన్మదినమైన నవంబర్ 14వ తేదీని భారత ప్రభుత్వం బాలల దినోత్సవంగా ప్రకటించి ప్రతి సంవత్సరం నిర్వహిస్తోందని తెలిపారు. బాలలే దేశ భవిష్యత్తు అని, వారిని వ్యసనాలకు, దురలవాట్లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా బాలల భవిష్యత్తును నాశనం చేసే మద్యం, గంజాయి తదితర నిషేధిత మత్తు పదార్థాలకు చిన్నారులు, యువత దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాలకవర్గ సభ్యులు పిలుపునిచ్చారు. గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ఇప్పటికే చేసిన తీర్మానాలను కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ విషయంలో ప్రతి పాలకవర్గ సభ్యుడు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, గ్రామంలో ఎక్కడైనా నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు లేదా సరఫరా జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు. బాలలకు మత్తు పదార్థాలు అందుబాటులో లేకుండా చూడటంతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు సమష్టిగా అవగాహన కల్పించాలని కోరారు. మత్తు పదార్థాల రహిత గ్రామాన్ని నిర్మించగలిగినప్పుడే ఆరోగ్యకరమైన భావితరాలకు బాటలు వేసినవారమవుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొల్లు దుర్గారావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, పసుమర్తి కుసుమాంబ, చిన్నశెట్టి నాగలక్ష్మి , సిబ్బంది మహాదేవ సాయి, కుప్పాల విజయ్, భీమా శ్రీనివాసరావు, కాకాని గణేష్ గ్రామస్తులు చిన్నశెట్టి ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్నారుల సమస్యలపై స్పందించిన సర్పంచ్

- బాలల దినోత్సవం సందర్భంగా ధర్మారంలో చిన్నారులతో గ్రామసభ
- పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని సర్పంచ్ శ్రీనివాస్ హామీ

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 14, : బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ధర్మారం గ్రామంలో బాలల దినోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి గ్రామసభ నిర్వహించడంతో పాటు, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ శ్రీనివాస్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులకు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు కోరారు. అదేవిధంగా పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఆటలు నిర్వహించాలని సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు తెలిపిన సమస్యలపై సర్పంచ్ శ్రీనివాస్ వెంటనే స్పందించారు. పాఠశాలలో అవసరమైన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజేష్‌ను ఆదేశించారు. త్వరలోనే పాఠశాలలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, మరియా, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చలి తీవ్రత పెరుగుతోంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

- దుబ్బాక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 14, : పెరుగుతున్న చలి తీవ్రత దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతూ ప్రజలను వణికిస్తోంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల వ్యాప్తంగా ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. చెట్లు, గుట్టలు మంచు దుప్పటి కప్పుకున్నట్లుగా కనిపిస్తూ ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నప్పటికీ, చలి తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు కారణంగా గ్రామాల్లో ఉదయం వేళ వీధి దీపాలను సైతం ఆలస్యంగా ఆర్పుతున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమరాజ్ సింగ్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. ముఖ్యంగా ఆస్తమా, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చలికాలంలో ప్రతి ఒక్కరూ గోరువెచ్చని నీటిని తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. చలి నుంచి రక్షణ పొందేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్స్ ధరించాలని, శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలని తెలిపారు. చిన్నారులు, వృద్ధులను చలి నుంచి కాపాడేందుకు కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ హేమరాజ్ సింగ్ సూచించారు.



విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ఫుడ్ ఫెస్టివల్స్

- శ్రీ ఎస్.పి.ఆర్. గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ ఎస్.పి.ఆర్. గ్లోబల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధికార ప్రతినిధి సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించి, ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూ వివిధ రకాల ఆహార పదార్థాలను స్వయంగా తయారు చేసి ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. విద్యార్థులు ఎంతో



ఉత్సాహంగా పాల్గొని తమలోని సృజనాత్మకతను వెలికితీశారు. ఈ సందర్భంగా కొలన్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఫుడ్ ఫెస్టివల్స్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసంతో పాటు వ్యాపార నైపుణ్యాలు, స్వయం ఉపాధిపై అవగాహన పెరుగుతాయని తెలిపారు. చదువుతోపాటు ఇలాంటి ఆచరణాత్మక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేగల సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

సీఎం సభకు సర్వం సిద్ధం చేయాలి.. పనులు వేగవంతం చేయాలి..

- 16 ఎకరాల విస్తీర్ణంలో భారీ బహిరంగ సభ ప్రాంగణం
- ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ కట్టా హైమావతి
- ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 14, :

ఈ నెల 19వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సభను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి సభా ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని నాగదేవత ఆలయం ఎదుట, నందాల వెంకటలక్ష్మి గార్డెన్ వెనుక భాగంలో బైపాస్ రోడ్డు, చిన్నగుండవెల్లి రోడ్డుకు ఆనుకుని సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ట్రాక్టర్లు, డోజర్ల సహాయంతో ప్రాంగణాన్ని చదును చేసే పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభా ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో చదును చేసి, అన్ని ఏర్పాట్లకు అనువుగా తీర్చిదిద్దాలని సూచించారు. లెవెలింగ్ పనుల్లో నాణ్యతతో పాటు వేగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, చేపట్టిన పనులన్నింటినీ ఆదివారంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సభా వేదిక, వీవీఐపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, సామాన్య ప్రజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా వీఐపీలు, ప్రజాప్రతినిధులు, అధికారుల



వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు విషయంలో సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకాలు కలగకుండా అవసరమైన మార్గదర్శకాలు సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేక గ్యాలరీలు, బారికేడ్ల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, తహసీల్దార్ కిరణ్, పోలీసు శాఖ అధికారులు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొక్కు పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయ పునరుద్ధరణ
- గ్రామస్థుల సమైక్యతతో ఘనంగా పూజా కార్యక్రమాలు

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 14, :

దుబ్బాక మున్సిపాలిటీలోని ధర్మాజీపేట గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, సుమారు వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ధర్మాజీపేట 'మొక్కు పోచమ్మ' అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సకల జీవకోటిని రక్షించే ఆదిపరాశక్తి దుర్గాదేవి స్వరూపంగా, భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న మొక్కు పోచమ్మ ఆలయం పురాతనమై జీర్ణావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గ్రామ పురోహితులు, పెద్దలు, అన్ని కుల సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులు ఏకమై ఆలయ పునరుద్ధరణకు, నూతన విగ్రహ ప్రతిష్ఠాపనకు సంకల్పించారు. మహోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామంలో అమ్మవారి నూతన విగ్రహ ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గోపూజ, ధ్వజపూజ, యాగశాలలో అగ్నిప్రతిష్ఠ, మండపారాధన, ద్వారతోరణ పూజ, మూలమంత్ర హవనాలు, విగ్రహానికి జలాధివాసం వంటి వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం వేళల్లో అమ్మవారికి ధాన్యాధివాసం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి, మంగళహారతి, మంత్రపుష్పం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల్లో మొక్కు పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, ధర్మాజీపేట గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

నెహ్రూ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

- దేశ నిర్మాణంలో ఆయన సేవలు చిరస్మరణీయం
- సిద్దిపేటలో ఘనంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు
- విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 14, :

భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న పురస్కార గ్రహీత స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని



శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ పోషించిన కీలక పాత్రను, స్వాతంత్ర్యం అనంతరం ఆధునిక భారతదేశ నిర్మాణానికి ఆయన చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. దేశాభివృద్ధికి విద్య, విజ్ఞానం, శాస్త్రసాంకేతిక రంగాలే పునాదులని విశ్వసించిన నెహ్రూ దూరదృష్టి నేటికీ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు, యువత దేశ భవిష్యత్తుకు పునాదులని భావించిన ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. నేటి యువత విద్య, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగుతూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. దేశానికి నెహ్రూ అందించిన సేవలు, ఆయన నెలకొల్పిన ఆదర్శాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఘనంగా నివాళులర్పించారు.



ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి బి ఎం సందీప్‌కు సుస్వాగతం



ALL INDIA CONGRESS COMMITTEE

K.C. VENUGOPAL, M.P.
General Secretary

24, AKBAR ROAD,
NEW DELHI-110 011

Phone (O) : 011-23019320
011-23019080
E-mail : kcvenugopal.org@gmail.com
kcvoffice@gmail.com
Website : www.inc.in

November 14, 2026

PRESS RELEASE

Hon'ble Congress President has appointed Shri B. M. Sandeep as the AICC In-charge of Telangana, with immediate effect.

The party appreciates the contributions of the outgoing AICC In-charge Ms. Meenakshi Natarajan.

(K. C. Venugopal)

- మీ రాకతోనైనా పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరగాలి

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 14, :

ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జిగా నియమితులైన బి ఎం సందీప్ కి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల తరఫున హృదయపూర్వక స్వాగతం, శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్‌లో బి ఎం సందీప్ రాకతో నూతన మార్పులు చోటుచేసుకుంటాయని, ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని, కష్టనష్టాలను ఎదుర్కొంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. వారి సేవలను గుర్తించి, వారికి సముచిత స్థానం, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడిన వారిని విస్మరించకుండా, క్షేత్రస్థాయిలో పార్టీకి అండగా నిలిచిన పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరిగేలా బి ఎం సందీప్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించాలని ఆకాంక్షించారు.

గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాహుల్ గాంధీ పోరాటానికి సంఘీభావం

- వారి సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుంది: కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : గిగ్ వర్కర్ల హక్కులు, సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, న్యాయవాది కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ ర్యాలీని కొలన్ హన్మంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన 200 మందికి పైగా గిగ్ వర్కర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గత కొన్నేళ్లుగా అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిగ్ వర్కర్ల కష్టాలను గుర్తించి, వారి సమస్యలను స్వయంగా ఆలకిస్తూ, వారికి అండగా నిలుస్తున్న రాహుల్ గాంధీ పట్ల గిగ్ వర్కర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణ, మెరుగైన పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతతో పాటు వారి సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్మికుల కష్టాలను గుర్తించి, వారి న్యాయమైన హక్కుల సాధనకు రాహుల్ గాంధీ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారి సంక్షేమం కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీకి, అలాగే తమ సమస్యలకు మద్దతుగా నిలిచి బైక్ ర్యాలీ విజయవంతం



కావడానికి కృషి చేసిన కొలన్ హన్మంత్ రెడ్డికి గిగ్ వర్కర్లు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం డివిజన్ అధ్యక్షులు సిద్ధోళ్ల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండ

- రూ.4.20 లక్షల విలువైన చెక్కుల పంపిణీ – కూన శ్రీనివాస్ గౌడ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆపన్నహస్తంగా నిలుస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, కూన కృష్ణ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కూన శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన సైదు రత్న, శ్రీనివాస్, దుగ్యాల రామారావు, రుబీనా, కుర్ర సుశీల, నందిమోని మహేష్, వి. నాగేష్‌లకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.4 లక్షల 20 వేల విలువైన చెక్కులను శనివారం షాపూర్ నగర్‌లోని



తన నివాసంలో కూన శ్రీనివాస్ గౌడ్ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తోందని తెలిపారు. ఆపద సమయంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టకాలంలో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని కూన శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్‌తో పాటు నాయకులు ప్రసాద్, తోసిఫ్, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐసీసీలో భారత్ సమ్మిట్ 2026లో పాల్గొన్న డా సత్యం శ్రీరంగం

- దేశాభివృద్ధి, సమ్మిళిత ప్రగతిపై ప్రముఖ నాయకులతో చర్చలు

కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 14 :

హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక భారత్ సమ్మిట్ 2026లో పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన సమ్మిట్ లో దేశాభివృద్ధి, ప్రగతి, సమ్మిళిత భవిష్యత్తు వంటి అంశాలపై ప్రముఖ నాయకులతో ఆలోచనలు పంచుకున్నారు. భారతదేశ అభివృద్ధికి సంబంధించిన వివిధ



అంశాలపై అభిప్రాయాల మార్పిడి, చర్చలకు ఈ సమ్మిట్ విలువైన వేదికగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక సమావేశంలో పాల్గొని ప్రముఖ నాయకులతో చర్చలు జరపడం సంతోషంగా ఉందని డా సత్యం శ్రీరంగం తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి

- ప్రజల విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, :



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లో ఉన్న తన కార్యాలయంలో శనివారం నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, పలువురు ప్రజలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తులపై ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సానుకూలంగా స్పందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలు, సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో నిర్వహించనున్న పలు శుభకార్యాలు, అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలకు హాజరుకావాలని బిల్డర్ సోమిరెడ్డి మిత్రబృందం ఆయనను ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో గాదె శివకు ప్రత్యేక గుర్తింపు

రాజా చేతుల మీదుగా సోనియా గాంధీ నూతన పుస్తకం అందజేత



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 14, :

తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా జరిగింది. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాదె శివ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం నల్గొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజ చేతుల మీదుగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ నూతన పుస్తకాన్ని బహుమతిగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ , టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీరంగం, బీ–బ్లాక్ అధ్యక్షులు వేణు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సలీం, రాష్ట్ర నాయకులు సునీల్ కుమార్ యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పాల్గొనగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమ్మిట్ జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, జాతీయ, రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నాయకులు, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టడం ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

సదర్ సంబరాలతో మార్మోగిన ఆల్విన్ కాలనీ



కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 14, :

హైదరాబాద్ యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళన మహోత్సవం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జలకన్య హోటల్ వద్ద తోట అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ యాదవ సోదరుల ఐక్యత, ఆత్మగౌరవం, సంస్కృతి సంప్రదాయాలకు సదర్ ఉత్సవం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. యాదవ సోదరుల కృషిని గౌరవిస్తూ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రభుత్వం సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించడం సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, డివిజన్ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువ నాయకులు, యువకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి



పాలకుర్తి ప్రతినిధి, నవంబర్ 14, :

హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక భారత్ సమ్మిట్ – ఫోర్జింగ్ ఎ న్యూ వరల్డ్ శనివారం కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, వెటా వ్యవస్థాపకురాలు, అధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మిట్‌లో భాగంగా నిర్వహించిన వివిధ సమావేశాలు, ప్యానెల్ చర్చల్లో పాల్గొని ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, సామాజిక అభివృద్ధి, మహిళా సాధికారత, అంతర్జాతీయ సహకారం, భవిష్యత్తు ప్రపంచ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై జరిగిన చర్చల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కళావతి నగర్ అభివృద్ధికి మరో ముందడుగు!

- స్మశాన వాటిక పక్క నుంచి కమిటీ హాల్ వరకు నూతన రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ 291వ డివిజన్ పరిధిలోని కళావతి నగర్ బస్తీ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. బస్తీలోని స్మశాన వాటిక పక్క నుంచి కళావతి నగర్ కమిటీ హాల్ వరకు నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ రహదారి పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కూన శ్రీశైలం గౌడ్ హయాంలో నిర్మించిన ఈ రహదారి మరమ్మతులు, పునర్నిర్మాణం కోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళావతి నగర్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు 291వ డివిజన్ నాయకులు కూన రాఘవేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళావతి నగర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. బొందలగడ్డ ప్రాంత అభివృద్ధికి రూ.150 లక్షల నిధులు, స్మశాన వాటిక పునర్నిర్మాణం, మహిళా భవన్ నిర్మాణానికి కృషి, అంతర్గత రహదారుల అభివృద్ధితో పాటు ప్రభుత్వ పాఠశాల పక్కన రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.42.50 లక్షల నిధులు మంజూరయ్యాయని వివరించారు. తాజాగా స్మశాన వాటిక పక్క నుంచి కమిటీ హాల్ వరకు నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం మరో విజయమని అన్నారు. గతంలో అభివృద్ధికి దూరంగా ఉన్న కళావతి నగర్‌లో ప్రస్తుతం ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులు కార్యరూపం దాలుస్తున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకెళ్లి, ఆయన సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను సాధించుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలే లక్ష్యంగా, కాలనీల అభివృద్ధే ధ్యేయంగా మరిన్ని పనులు చేపట్టేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని సహకరించిన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులకు కూన రాఘవేందర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి మద్దతు తెలిపిన కళావతి నగర్ బస్తీ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. అభివృద్ధే మా నినాదం అని కూన రాఘవేందర్ గౌడ్ పేర్కొన్నారు.

కార్తీక శోభతో వెలుగులు విరజిమ్ముతున్న గాజులరామారం.. ఆధ్యాత్మిక వైభవం!

- నేడు చండీ హోమం.. చిత్తారమ్మ తల్లికి లక్ష గాజుల అర్చన

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలోని నిరంజని పెట్రోల్ బంక్ వెనుక భాగంలో నకులేశ్వరి దేవి సిద్ధిపీఠం ఫౌండర్ అండ్ చైర్మన్ తిరునగిరి నరేంద్ర ఆచార్యులు (నందు స్వామి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం భక్తిభావంతో అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. గత మూడు రోజులుగా ప్రతిరోజూ సాయంత్రం నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా నవనాగుల పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, శనివారం సాయంత్రం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని దీపాలను వెలిగించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కోటి దీపోత్సవానికి కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు తదితర నియోజకవర్గాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజూ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు.

నేడు చండీ హోమం.. లక్ష గాజుల అర్చన

కోటి దీపోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం చండీ హోమం, సాయంత్రం చిత్తారమ్మ దేవికి లక్ష గాజుల అర్చన కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు సిద్ధిపీఠం ఫౌండర్ అండ్ చైర్మన్ తిరునగిరి నరేంద్ర ఆచార్యులు (నందు స్వామి) తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో నకులేశ్వరి దేవి సిద్ధిపీఠం అధ్యక్షులు కజ్జపు అఖిలేశ్వర్ శర్మ, జీవనిగే రవితేజ శర్మ, మోహన్ ఆచార్యులు, సిద్ధిపీఠం ముఖ్య సలహాదారు సోనేని రవికుమార్, సలహాదారులు గంట శివారెడ్డి, లలిత్ రాజ్, సభ్యులు వీరేందర్ శర్మ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



నేటి బాలలే భావిభారత మేధావులు

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలి
- బాపూజీ ఉన్నత పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : నేటి బాలలే రేపటి భావిభారత మేధావులని, విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని బాపూజీ ఉన్నత పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జగద్గిరిగుట్ట పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో ఉన్న బాపూజీ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవ వేడుకలను చిన్నారుల కేరింతలు, ఆటపాటల మధ్య ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నవ్వా ప్రభాకర్ రావు మాట్లాడుతూ, ప్రతి చిన్నారి జీవితంలో విద్య అనేది వెలుగునిచ్చే దీపం లాంటిదని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడిక, సేవాభావం, మానవత్వం వంటి ఉత్తమ విలువలను చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల అభిరుచులు, మనోభావాలను తల్లిదండ్రులు అర్థం చేసుకొని వారిని ప్రోత్సహించాలని, అప్పుడే పిల్లలు తమలోని ప్రతిభను చాటుకుంటూ దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదుగుతారని అన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదువుతూ ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందిస్తూ, ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు తమ పాఠశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. బాలల దినోత్సవ వేడుకలతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య వేడుకలు ఘనంగా ముగిశాయి.

పేద విద్యార్థినుల బంగారు భవిష్యత్తుకు గురుకుల విద్య బాట

- బాలికల విద్యాభివృద్ధికి గురుకుల కళాశాలలు ఎంతో దోహదం : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- రూ.22.50 కోట్లతో బాచుపల్లిలో నిర్మించిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాల నూతన భవనాలు ప్రారంభం



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 14, : పేద విద్యార్థినుల ఉన్నత విద్యా కలలను సాకారం చేస్తూ, వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్న గురుకుల విద్యాసంస్థలు విద్యా దేవాలయాలుగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సంస్థ సౌజన్యంతో సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లిలో సుమారు రూ.22.50 కోట్ల వ్యయంతో మూడు అంతస్తుల్లో అధునాతన వసతులతో నిర్మించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాల నూతన భవనాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, హెచ్ఏఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. రవి ముఖ్య అతిథులుగా హాజరై భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి ప్రతిభను వెలికితీసేందుకు గురుకుల విద్యాసంస్థలు ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ విద్యాసంస్థల నిర్మాణానికి సహకరిస్తున్న హెచ్ఏఎల్ సంస్థ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి విద్యాసంస్థలు మరింత అభివృద్ధి చెందడం ద్వారా పేద విద్యార్థినులకు ఉన్నత విద్యావకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థినుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన భవనంలో విశాలమైన తరగతి గదులు, బోధనా ప్రయోగశాలలు, పరీక్షల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు, పరిపాలనా కార్యాలయాలు, క్రీడలు, ఇతర వినోద కార్యక్రమాలకు అవసరమైన సౌకర్యాలను సమగ్రంగా ఏర్పాటు చేశారు. ఆధునిక వసతులతో నిర్మించిన ఈ భవనం విద్యార్థినుల విద్యాభ్యాసానికి ఎంతగానో ఉపయోగపడనుంది. అంతకుముందు ముఖ్య అతిథులకు విద్యార్థినులు గౌరవ వందనంతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ డైరెక్టర్ (హెచ్ఆర్) ఎం.జి. బాలసుబ్రమణ్య, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి. విజయేంద్ర బోయి, సెక్రటరీ జి. రవి, ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య భట్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి

ఆహార అలవాట్లు మీకు తెలుసా ?



యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం

కీళ్లలోనూ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలం దెబ్బతినే అవకాశం

ప్రస్తుతం కాలంలో చాలా మంది యూరిక్ యాసిడ్ సమస్యతో ఇబ్బంది అనారోగ్యానికి గురవుతున్నారు. యూరిక్ యాసిడ్ అనేది మన రక్తంలో కనిపించే వ్యర్థ పదార్థం. శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్ల కీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు

మనం తీసుకునే ఆహారంలోని ప్యూరిన్స్ అనే పదార్థాల విచ్ఛిన్నంలో భాగంగా యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. రక్తంలోని యూరిక్ యాసిడ్ మూత్రం ద్వారా విసర్జితమవుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఉత్పత్తి పెరిగినా, విసర్జన సరిగా జరగకపోయినా అది రక్తంలోనే నిలిచిపోయి స్ఫటికాలుగా కీళ్లలోనూ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలంలో చేరుతుంది. అప్పుడు కీలు వాచిపోయి, కదలికలు కష్టంగా మారతాయి. ఇది గౌట్‌కు దారితీస్తుంది. అధిక బరువు, వయసు పెరగడం, వంశపారంపర్యంగానూ యూరిక్ సమస్య ఎదురవుతుంది. యూరిక్ యాసిడ్ సమస్యను నిర్లక్ష్యం చేస్తే.. అనేక తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. యూరిక్ యాసిడ్ మోతాదు పెరుగుదల శరీరంలో ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌ను సృష్టించి, అన్ని అవయవాలనూ ప్రభావితం చేస్తుంది. దీనికారణంగా గుండె, కాలేయం, గాల్ బ్లాడర్, మూత్రపిండాల పనితీరుపై ప్రభావం పడుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించడానికి కొన్ని ఇంటి చిట్కాలు సహాయపడతాయి. అవేంటో ఈ స్టోరీలో చూసేద్దాం.



ఒక టీస్పూన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను ఒక గ్లాసు నీటిలో కలపండి. ఈ నీళ్లు రోజు తాగితే.. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. యాపిల్ సైడర్ వెనిగర్ నేచురల్ క్లెన్సర్, డిటాక్సిఫైయర్‌లా పనిచేస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో మాలిక్ యాసిడ్ ఉంటుంది, ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేయడానికి, తొలగించడానికి సహాయపడుతుంది. యాపిల్ పండ్లలోనూ మాలిక్ యాసిడ్ ఉంటుంది. రోజు ఒక యాపిల్ తిన్నా మేలు జరుగుతుంది.

ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేటరీని నివారించడమే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజు కనీసం ఒక ఉసిరికాయను తినడం అలవాటు చేసుకోవాలి.



శరీరంలో అధికంగా పేరుకున్న నిమ్మరసాన్ని తొలగించడానికి రోజుకు కనీసం రెండుసార్లు నిమ్మరసం తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. నిమ్మరసంలో సిట్రిక్ యాసిడ్ సమృద్ధిగా ఉంటుంది, ఇది యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. మీ డైట్‌లో ఉసిరి, జామ, నారింజ వంటి విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలు తీసుకున్నా మేలు జరుగుతుంది.



ఎండిన కొత్తిమీర ఆకులు శరీరం నుంచి యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో సహాయపడతాయి. కొత్తిమీర ఆకుల్లో యూరిక్ యాసిడ్ ను మూత్రంతో తొలగించే గుణాలు ఉంటాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగిన వ్యక్తులు కొత్తిమీర టీ లేదా కొత్తిమీర నీటిని తీసుకుంటే మంచిది.

యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో వేప ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది.





రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది.



ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి





ఆలూ పొట్టులో అధిక పోషకాలు

బంగాళదుంపలు ఇష్టపడని వారు ఉండరేమో. ఈ ఆలుగడ్డలతో రకరకాల వంటను చేసుకొని లాగించేస్తుంటారు. అయితే బంగాళదుంప కూర.. లేదంటే చిప్స్, ఇతర వంటకాలు చేసేటప్పుడు.. పొట్టును తీసి పక్కకు పడేస్తుంటాము. అయితే ఆలుగడ్డల పొట్టులోనే అధిక పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆలు తొక్కను తీసేస్తే చాలా పోషకాలు మిస్ అయిపోతామని నిపుణులు చెబుతన్నారు. తొక్కపై అంతా మట్టి, దుమ్ము ఉంటాయి కనుక పొట్టును తీసేయాల్సి వస్తుంది. అయితే వాస్తవానికి ఆలూను పొట్టుతో సహా తినాలి. పొట్టులో అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ముఖ్యంగా ఫైబర్ ఉంటుంది. పొట్టులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది హైబీపీని తగ్గిస్తుంది. నాడీ వ్యవస్థ పని తీరును మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చూస్తుంది.




యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం

ఆలు పొట్టులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతాయి. ఆర్థరైటిస్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. అధిక బరువు సమస్య నుంచి బయట పడతారు. మెరిసే చర్మం మీ సొంతం అవుతుంది. అందుకే ఇప్పటి నుంచైనా ఆలుగడ్డ తొక్కతో పండుకోవడానికి ప్రయత్నించండి. లేదంటే విలువైన పోషకాలు మిస్సవుతారు.

తల్లిదండ్రుల మనసు నొప్పించకండి..

ఈ ప్రశ్నలు అడిగి విసిగించకండి



తల్లిదండ్రులు చిన్నప్పుడు మనల్ని ఎలాగైతే కంటికి రెప్పలా కాపాడుకుంటారో.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను మనం కూడా అలాగే చూసుకోవాలి. అయితే ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో చాలా మంది తల్లిదండ్రులను భారంగా భావిస్తున్నారు. ఒకవేళ వారి పేరిట ఆస్తిపాస్తులు ఉంటే తప్ప పట్టించుకోవడం లేదు. అయితే తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వారిని అనవసర ప్రశ్నలు అడిగి విసిగించొద్దంటున్నారు.



shutterstock.com - 231948

నిర్ణయాలపై ప్రశ్నించొద్దు?

తల్లిదండ్రులు గతంలో తీసుకున్న నిర్ణయాల గురించి వారిని పదే పదే ప్రశ్నించొద్దు.. ఆ నిర్ణయాల గురించి వారిని గుచ్చి గుచ్చి అడగడం.. ఫలానా పని ఎందుకు చేశారని నిలదీయం వారిని హర్ట్ చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

పోల్చడమూ మంచిది కాదు..

మనం పిల్లల్ని ఇతర పిల్లలతో పోల్చడం కరెక్ట్ కాదు.. అలాగే వృద్ధులైన తల్లిదండ్రులను ఫలానా వాళ్లతో పోల్చి మీరు వాళ్లకంటే ఎక్కువ ఎందుకు సంపాదించలేదు? వారిలా ఆస్తులు ఎందుకు కూడబెట్టలేదు.. అని అడగడం కరెక్ట్ కాదంటున్నారు నిపుణులు. ప్రతి ఒక్కరూ ఏదైనా ఓ విషయంలో ఫెయిల్ అవుతూనే ఉంటారు. దీని గురించి మళ్ళీ ప్రస్తావించకూడదు. వారి ఎక్స్ లవ్, మాజీ ప్రేమ, పెళ్ళి వంటి అంశాలను వారిని అడిగి బాధపెట్టొద్దు.

సంబంధాలు..

తల్లిదండ్రులు వారు ఎన్నో అనుభవాలని చూసే వచ్చారు. కానీ, వీటి గురించి ఆలోచించక చాలా మంది వారి సంబంధాల గురించి మాట్లాడతారు. వారి పర్సనల్స్, రొమాన్స్ గురించి మాట్లాడడం మంచిది కాదు. తల్లిదండ్రుల్ని ఎప్పుడైనా ఆర్థిక విషయాల గురించి ఆరా తీసి ఇబ్బంది పెడతారు కొంతమంది పిల్లలు. మీరు ఎంత డబ్బు సంపాదించారు? ఎవరికిస్తారు. వీలునామా రాశారా అంటూ ఆరాలు తీస్తారు. కానీ, ఇవి అంత మంచిది కాదు. వీని వారు ఇష్టముంటేనే చెప్పేలా చూసుకోండి.

చివరి బంతి వరకు ఉత్కంఠ

- పాక్‌పై భారత్ సంచలన విజయం!
- ఒక్క వికెట్ తేడాతో యువ భారత్
- ఫోర్‌తో గెలిపించిన మోహిత్ ఉల్వా
- 338 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా







మస్కట్ (ఒమన్), నవంబర్ 14 (చురకలు): చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన అండర్-19 ఆసియా కప్ 2026 ఫైనల్ పోరు అభిమానులకు అసలైన క్రికెట్ మజాను పంచింది. చివరి ఓవర్ చివరి బంతి వర కు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. పాకిస్థాన్ నిర్దేశించిన 340 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ 49.6 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో ఒక్క వికెట్ తేడాతో గెలిచి అండర్-19 ఆసియా కప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. టాస్ గెలిచిన పాకిస్తాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ అద్భుత సెంచరీతో చెలరేగాడు. 111 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 107 పరుగులు చేశాడు. అబ్దుల్ ఖాదిర్ 54 బంతుల్లో 80 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్ 60బంతుల్లో 63 పరుగులు చేసి కీలక భాగస్వామ్యం అందించాడు. దీంతో పాకిస్తాన్ భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో కావ్య పటేల్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. చిరుగుపాటి వెంకట మూడు వికెట్లతో రాణించాడు. చివరి ఓవర్లలో భారత బౌలర్లు కట్టడి చేయడంతో పాకిస్థాన్ స్కోరు 340 పరుగుల లోపే నిలిచింది.

నిలకడగా ఆడిన భారత్

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు ఆర్య వీర్ సెహ్వాగ్, కెప్టెన్ లక్ష్య రాజేశ్ రాయచందన్ మంచి ఆరంభాన్ని అందించారు. ఇద్దరూ తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆర్యవీర్ సెహ్వాగ్ 61 బంతుల్లో 58 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం లక్ష్య రాజేశ్ రాయచందన్ 101బంతుల్లో 80 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అయితే ఆర్యవీర్ ఔటైన తర్వాత వికెట్లు వరుసగా పడిపోయాయి. వీకే వినీత్ 24, అర్జున్ రాజ్‌పుత్ 16, యశ్‌బర్ధన్ చౌహాన్ 9 పరుగులు చేశారు. కెప్టెన్ లక్ష్యతో పాటు అన్వయ్ ద్రవిడ్ కూడా పెవిలియన్‌కు చేరడంతో భారత్ కష్టాల్లో పడింది. ఒక దశలో భారత్ 251 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. లక్ష్యం ఇంకా దూరంలో ఉండగా వికెట్లు వరుసగా పడటంతో పాకిస్తాన్ విజయం ఖాయమనిపించింది. ఈ సమయంలో మానల్ చౌహాన్, మొహిత్ ఉల్వా అద్భుత పోరాటం చేశారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మానల్ చౌహాన్ 32 బంతుల్లో 47 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. మొహిత్ ఉల్వా మరింత దూకుడుగా ఆడాడు. కేవలం 22 బంతుల్లో 43 పరుగులు చేసి భారత విజయంపై ఆశలు రేకెత్తించాడు. అతడి ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. మానల్ జోటైనా మొహిత్ పోరాటం ఆపలేదు. చిగురుపాటి వెంకటతో కలిసి జట్టును విజయానికి చేరువ చేశాడు. చివరి ఓవర్‌లో భారత్ విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. పాకిస్తాన్ తరఫున అహ్మద్ హుస్సేన్ బంతిని అందుకున్నాడు. మరోవైపు మొహిత్ ఉల్వా, చిగురుపాటి వెంకట క్రీజులో ఉన్నారు. తొలి బంతికి మొహిత్ పరుగులేమీ చేయలేదు. రెండో బంతికి సింగిల్ తీశాడు. మూడో బంతికి వెంకట ఒక పరుగు సాధించడంతో భారత్ విజయానికి ఐదు పరుగుల దూరంలో నిలిచింది. నాలుగో బంతికి మొహిత్ మరో పరుగు తీశాడు. ఐదో బంతికి వెంకట సింగిల్ తీసుకోవడంతో స్కోరు సమం కావడానికి అవసరమైన పరిస్థితి ఏర్పడింది. చివరి బంతికి మొహిత్ ఉల్వా ఫోర్ బాదడంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. 9 వికెట్లు కోల్పోయినప్పటికీ అద్భుత పోరాటంతో భారత్ ఒక్క వికెట్ తేడాతో విజయాన్ని అందుకుంది.

పరుగుల వీరుడికి 'సున్నా' షాక్



- సచిన్‌తో సమంగా కోహ్లీ!
- వన్డేల్లో అత్యధిక డకౌట్ల భారత ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానం

మౌంట్ మౌంగనుయ్, నవంబర్ 14 (చురకలు): టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఖాతాలో ఓ అవాంఛిత (చెత్త) రికార్డు చేరింది. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అత్యధికసార్లు పరుగులేమీ చేయకుండా (డకౌట్) వెనుదిరిగిన భారత ఆటగాళ్ల జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో కలిసి కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్‌తో శుక్రవారం మౌంట్ మౌంగనుయ్‌లోని బే ఓవల్ వేదికగా జరిగిన నాలుగో వన్డేలో నాలుగు బంతులు ఎదుర్కొన్న కోహ్లీ, ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరడంతో ఈ చెత్త రికార్డు నమోదైంది. వన్డే క్రికెట్ చరిత్రలో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ ఇద్దరూ తమ కెరీర్‌లో ఇప్పటివరకు చెరో 20 సార్లు డకౌట్ అయ్యారు. అయితే క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ తన సుదీర్ఘ కెరీర్‌లో 463 వన్డే మ్యాచ్‌లు ఆడి 20 సార్లు సున్నా చుట్టగా, విరాట్ కోహ్లీ కేవలం 321 మ్యాచ్‌ల్లోనే ఆ సంఖ్యను సమం చేయడం గమనార్హం. ఈ జాబితాలో భారత మాజీ పేసర్ జవగల్ శ్రీనాథ్ 229 మ్యాచ్‌ల్లో 19 డకౌట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత ఆటగాళ్ల జాబితాలో మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే (295 మ్యాచ్‌లు), కెప్టెన్ రోహిత్ శర్మ (269 మ్యాచ్‌లు), మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ (301 మ్యాచ్‌లు) తలో 18 డకౌట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. ఇక ఓవరాల్‌గా అంతర్జాతీయ వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక డకౌట్ల రికార్డు శ్రీలంక మాజీ దిగ్గజ ఓపెనర్ సనత్ జయసూర్య పేరిట ఉంది. ఆయన తన వన్డే కెరీర్‌లో 433 ఇన్నింగ్స్‌లు ఆడి ఏకంగా 34 సార్లు పరుగులేమీ చేయకుండానే వెనుదిరిగాడు.

వాటా విక్రయానికి మెహతా గ్రూప్ కసరత్తు!

- కేకేఆర్‌లోకి అమెరికా దిగ్గజం?..
- ఒప్పందంపై ఇంకా వెలువడని అధికారిక ప్రకటన



కోల్‌కతా, నవంబర్ 14 (చురకలు): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మరో భారీ పెట్టుబడి ఒప్పందానికి రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మూడుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీలోకి అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడి సంస్థ ఏరెస్ మేనేజ్‌మెంట్ ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేకేఆర్‌లో మైనారిటీ వాటాను కొనుగోలు చేసేందుకు ఆ సంస్థ ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఈ మేరకు ఫ్రాంచైజీ యాజమాన్యంతో చర్చలు జరుగుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం కేకేఆర్ యాజమాన్యం నైట్‌రైడర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చేతుల్లో ఉంది. ఇందులో బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌కు చెందిన రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు 55 శాతం, నటి జూహీ చావ్లా, పారిశ్రామికవేత్త జే మెహతాకు చెందిన మెహతా గ్రూప్‌కు 45 శాతం వాటా ఉంది. తాజా సమాచారం ప్రకారం మెహతా గ్రూప్ తన వాటాలో సుమారు 20 శాతం విక్రయించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ చర్చల్లో కేకేఆర్ మొత్తం విలువను 180 కోట్ల అమెరికన్ డాలర్లుగా అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఏరెస్ మేనేజ్‌మెంట్‌తో ఒప్పందం కుదిరితే మెహతా గ్రూప్ వాటాలో కొంత భాగం కొత్త పెట్టుబడిదారుడి చేతికి వెళ్లనుంది. షారుఖ్ ఖాన్‌కు చెందిన రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ వాటాలో మాత్రం మార్పు ఉండకపోవచ్చని సమాచారం. అయితే విక్రయించే వాటా పరిమాణం, పెట్టుబడి మొత్తం, ఒప్పంద నిబంధనలపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవలి కాలంలో ఐపీఎల్ ఫ్రాంచైజీలపై అంతర్జాతీయ పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్య వాటాలకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో కేకేఆర్ వ్యవహారం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఏరెస్ మేనేజ్‌మెంట్ పెట్టుబడులు పెడుతుందా, మెహతా గ్రూప్ ఎంత వాటా విక్రయిస్తుందనే అంశాలపై అధికారిక ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంది.



15 ఏళ్లకే కెప్టెన్‌గా ప్రపంచ రికార్డు..

వైభవ్ సూర్యవంశీ అరుదైన ఘనత

భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన రికార్డు సృష్టించాడు. పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన ఆటగాడిగా నిలిచాడు. 15 ఏళ్ల 232 రోజుల వయసులో శనివారం ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో సౌరాష్ట్రతో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లో బిహార్ జట్టుకు నాయకత్వం వహించాడు. సొంత రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం రావడం ఆనందంగా ఉందని వైభవ్ తెలిపాడు. గతంలో దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన అతడు.. ఇషాన్ కిషన్ గాయపడిన సమయంలో జట్టును నడిపించాడు. ప్రస్తుతం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడి, అనంతరం ఎమర్జింగ్ ఆసియా కప్‌లో భారత జట్టుతో చేరనున్నాడు. గత ఏడాది అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 175 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన వైభవ్.. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును అందుకున్నాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 237.30 స్ట్రైక్‌రేట్‌తో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు. జూలైలో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అంతర్జాతీయ టీ20 అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ప్రొఫెషనల్ టీ20ల్లో 44 మ్యాచ్‌లు ఆడిన వైభవ్.. బిహార్ తరఫున గతంలోనూ ఆకట్టుకున్నాడు. మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో 61 బంతుల్లో అజేయంగా 108 పరుగులు సాధించాడు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ యువ సంచలనం భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.



అర్జున అందుకున్న ధనుష్ శ్రీకాంత్

న్యూఢిల్లీ: తెలంగాణ షూటర్ ధనుష్ శ్రీకాంత్ ప్రతిష్టాత్మక క్రీడా పురస్కారం అర్జున అవార్డు అందుకున్నాడు. రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2026 జాతీయ క్రీడా పురస్కారాలను విజేతలకు ప్రదానం చేశారు. శ్రీకాంత్ (డెఫ్ షూటింగ్) సహా మొత్తం 17 మంది క్రీడాకారులు ప్రతిష్టాత్మక అర్జున అవార్డులకు ఎంపికయ్యారు. 2014 తర్వాత తొలిసారిగా మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న పురస్కారం ఎవరికీ ప్రకటించకుండానే ఈ వేడుకను నిర్వహించడం గమనార్హం. అర్జున అవార్డు అందుకున్న వారిలో తేజస్విన్ శంకర్ (అథ్లెటిక్స్), దివ్య దేశ్‌ముఖ్, విదిత్ గుజరాతీ (చెస్), ట్రీసా జాలీ (బ్యాడ్మింటన్), నరేందర్ (బాక్సింగ్) తదితరులు ఉన్నారు.



అతను నా లక్కీ చార్మ్: మృణాల్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ తన కెరీర్‌లో ప్రత్యేక పాత్ర పోషించారని నటి మృణాల్ ఠాకూర్ వెల్లడించారు. ప్రస్తుతం నటిగా తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఆయన కూడా ఒక కారణమని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. రణ్‌వీర్‌ను తన లక్కీ చార్మ్‌గా అభివర్ణించారు. కెరీర్ ఆరంభంలో రణ్‌వీర్ సింగ్‌తో కలిసి ఓ హెయిర్ బ్రాండ్ వాణిజ్య ప్రకటనలో నటించిన విషయాన్ని మృణాల్ గుర్తుచేసుకున్నారు. ఆ యాడ్ ద్వారా తనకు మంచి గుర్తింపు లభించిందని, అనంతరం సినీ నిర్మాతలు తనను గుర్తించి అవకాశాలు ఇవ్వడం మొదలుపెట్టారని తెలిపారు. రణ్‌వీర్ వ్యక్తిత్వం, పని పట్ల ఆయన చూపించే అంకితభావాన్ని మృణాల్ ప్రశంసించారు. ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఉండే ఆయన.. ప్రతి పాత్ర కోసం ఎంతో కష్టపడతారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన సాధిస్తున్న విజయాల వెనుక కఠోర శ్రమ, పట్టుదల ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల విడుదలైన 'ధురంధర్ 2'లో రణ్‌వీర్ నటన తనను ఎంతగానో ఆకట్టుకుందని మృణాల్ అన్నారు. సినిమా చూస్తున్నంతసేపు రణ్‌వీర్ కనిపించలేదని, కేవలం హమ్జా పాత్ర మాత్రమే కనిపించిందని కొనియాడారు. ఆ పాత్రలో పూర్తిగా లీనమై నటించి తన అద్భుతమైన నటనా ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారని ప్రశంసించారు.

స్టైలిష్ లుక్‌లో అవ్నీత్ కౌర్



బుల్లితెర నటీమణులు కూడా వెండితెర హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోరని నిరూపిస్తున్న వారిలో అవ్నీత్ కౌర్ ఒకరు. తాజాగా ఆమె పంచుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి. నలుపు, వెండి రంగుల చారలతో కూడిన స్ట్రాప్‌లెస్ టాప్, ఫ్రిల్స్‌తో కూడిన బ్లాక్ మినీ స్కర్ట్‌లో అవ్నీత్ మెరిశారు. సిల్వర్ ప్లీట్స్, చైన్ బెల్ట్, స్టార్ డిజైన్‌తో కూడిన హీల్స్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బ్లూ నెయిల్స్, లైట్ మేకప్, వదులుగా వదిలిన ఉంగరాల జుట్టుతో స్టైలిష్‌గా కనిపించారు. ప్రస్తుతం టీవీ సీరియళ్లకు దూరంగా ఉంటున్న అవ్నీత్.. సినిమాలు, వెబ్ సిరీస్‌లపై దృష్టి పెట్టారు. త్వరలో విడుదల కానున్న 'గన్‌మాస్టర్ జీ9' చిత్రంలో ఆమె భాగమయ్యారు.

ఆ ఘటన ఇప్పటికీ నన్ను వెంటాడుతోంది



'ఇండియన్ 2' సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఘోర ప్రమాదం తనను ఇప్పటికీ భయపెడుతోందని హీరోయిన్ కాజల్ అగర్వాల్ వెల్లడించారు. ఆ ప్రమాదంలో తాను కూడా ప్రాణాలు కోల్పోయి ఉండేదాన్నని, అదృష్టవశాత్తూ బయటపడ్డానని గుర్తుచేసుకున్నారు. 2020 ఫిబ్రవరిలో చెన్నైలోని ఈవీపీ ఫిల్మ్ సిటీలో కమల్ హాసన్ హీరోగా, శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇండియన్ 2' షూటింగ్ సమయంలో భారీ క్రేన్ కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ప్రమాద సమయంలో తాను మానిటర్ సమీపంలో కూర్చున్నానని, క్రేన్ తనవైపు దూసుకొస్తుండగా ఎవరో వెనక్కి లాగి కాపాడారని కాజల్ తెలిపారు. తనను కాపాడిన వ్యక్తి ఎవరో ఇప్పటికీ తెలియదని, ఆ భయానక ఘటనను తలుచుకుంటే ఇప్పటికీ వణుకు పుడుతోందని చెప్పారు.

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత



తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో సినీ ప్రముఖులు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 1943 జూన్ 8న ప్రకాశం జిల్లాలో జన్మించిన గిరిబాబు.. సినిమాలపై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో ప్రతినాయకుడిగా తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. విలక్షణమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ అంచెలంచెలుగా గుర్తింపు సంపాదించారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా గిరిబాబు తన ప్రతిభను చాటుకున్నారు. సుమారు ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 600కు పైగా చిత్రాల్లో నటించారు. ప్రతినాయకుడిగా భయపెట్టిన ఆయన.. హాస్యనటుడిగా నవ్వులు పంచారు. తండ్రి, తాత పాత్రల్లోనూ తనదైన నటనతో ప్రేక్షకులకు చేరువయ్యారు. దశాబ్దాల పాటు తెలుగు చిత్రసీమలో విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గిరిబాబు మరణం టాలీవుడ్‌కు తీరని లోటు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పిస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com